శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై!  సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



గురుపూర్ణిమ సంచిక

# గురుకృప

గురువే అన్ని దైవాలు, గురువును ఎప్పుడూ నమ్ముకో అదే అసలైన సాధన

# సాయి భక్తుడు అంటే ?

సాయి భక్తుడు అని అంటే
బాబానే నాకు సర్వస్వం,
బాబానే నాకు దైవము, సర్వం ఆయనేను,
నేను ఏమి చేసినా, నా మంచి చెడ్డలు అన్నీ
కూడాను ఆయన స్వాధీనంలో ఉన్నాయి
అనేటువంటి సంపూర్ణమైనటువంటి
విశ్వాసం ఎవరికైతే ఉంటుందో,
వాళ్ళే బాబా భక్తులు.



బాబాను నమ్ముకున్న వాడు,
ప్రతి దానికి నమ్ముకున్నవాడు
బాబా మీద ఆధారపడ్డవాడు - డిపెండెంట్.
మాసాలు మాత్రమే ఉండేటువంటి పసిబిడ్డ
తల్లి మీద ఎట్లా
ఆధారపడుతుందో,
అట్లా ఆధారపడినటువంటివాడు.

సంపుటి : 17
జూలై 12

సంచిక : 3
2014

# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



### లోపలి పేజీలలో

శరశ్చంద్రుని వెన్నెల... 'ప్రేమ'ను పంచింది 'అమ్మ'లా 4
- గురుకృప

మహాత్ముల జీవిత చరిత్రలు 8
- శరశ్చంద్రికలు

సరైన ప్రయత్నం 14
- శరశ్చంద్రికలు

తలక్రిందులుగా వ్రేలాడటంలోని అంతరార్థం 21
- శరశ్చంద్రికలు

గురుపూజలలో ఆజ్యధార! అమృతధార! 28
- గురుకృప

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**

**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.

# శరశ్చంద్రుని వెన్నెల... 'ప్రేమ'ను పంచింది 'అమ్మ'లా



ప్రేమ-అమ్మ. సృష్టిలో ఈ రెంటికీ ఉన్న బంధం ఎలాంటిది? విడదీయలేనంత... అంతులేనంత, ఆకాశమంత, మాటల్లో చెప్పలేనంత... (నేను కవిని కాను) అందుకే సాయివసించిన మసీదు అయ్యింది ద్వారకా'మాయి'. సద్గురువనే 'అమ్మ' యుగాల పర్యంతం – ఎన్నో జన్మల పర్యంతం, బిడ్డ పరిపూర్ణతకై కడదాకా తోడుండి 'గమ్యాన్ని' చేరేవరకు మనకై శ్రమిస్తోంది. మనలను అమ్మలా అనుక్షణం ప్రేమిస్తోంది.

నామవాచకాలే మారుతున్నాయి... శ్రీసాయిబాబా.... శ్రీబాబూజీ. సద్గురుపథము అదే! 'సద్గురువు' అన్న పదములో మాధుర్యము అదే! ఎవరో పెద్దాయన చెపుతుంటే విన్నాను "సాయినాథాయ సమారంభం భరద్వాచార్య మధ్యమామ్... అస్మదాచార్య పర్యంతం వందే గురుపరంపరామ్" అంటూ... ఇదీ సద్గురు సనాతన ప్రవంతి. అవధులు లేని అనుగ్రహ క్రాంతి... సాయిభక్తులకు సద్గురు చరణాలే సదా విశ్రాంతి. 'అమ్మ' ఒడిలో పసిపాపలా – కల్మషం లేని కనుపాపలా గడిచేకాలం, గడిచినంత కాలం అది స'కాలం'– సద్గురుని ప్రేమ గాలం. కానీ ప్రకృతి ధర్మం 'పరిణామం'. బుడి బుడి అడుగుల తప్పటడుగులు నుంచి.... బడికి... యవ్వనపు జడికి... వార్ధక్యపు గుడికి... అలజడి లేకుండా సాగిపోవాలని బిడ్డ శ్రేయస్సు ఆకాంక్షించేది 'అమ్మ'. అయితే ఇహపరశ్రేయోదాయి – సాయి – మన సద్గురుమాయి ఆకాంక్ష – సర్వోన్నత శ్రేయస్సు – తన బిడ్డలు తానంతటి వారవ్వడం–మనిషి దైవంగా ఎదగడం. ఒకొక్క జీవిది ఒకొక్క సంస్కారం. వారి వారి సంస్కారాలనుసరించి వారిని పరిపూర్ణులుగా మలచడం. తల్లికి, బిడ్డలందరూ ఒక్కటే కదా. కొంతమంది చిన్నారులు సిబిఎస్ఇ సిలబస్, మరి కొంతమంది ఐసిఎస్ఇ, ఇంకొందరు స్టేట్ సిలబస్, ఇలా ఎవరి మార్గమేదైనా అందరి లక్ష్యము జ్ఞాన సముపార్జనే కదా! ఏ తల్లి మాత్రం తన చిన్నారి ఎప్పుడూ ఒకటవ తరగతిలోనే ఉంటూ ముద్దు ముద్దుగా మాట్లాడుతూ ఉండి పోవాలని ఆశిస్తుంది చెప్పండి.

అమ్మఒడిలో... కాలపు బడిలో నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. నేర్చుకునే దృక్పథం మనకుండాలి అంతే! ప్రతీ కదలిక సద్గురు లీలా ప్రబోధమే. సద్గురుపథంలో కొందరు విద్యార్థులవుతారు. కొంతమంది శిష్యులు... కానీ సద్భక్తులు అరుదుగా ఉంటారు. విద్యార్థికి అవసరమైంది కేవలం సమాచారం మాత్రమే! శిష్యుడైన వాడు జ్ఞానానికి పరిమితమవుతాడు. అయితే సద్భక్తుడు మాత్రం వీటికన్నింటికి అతీతుడు. సద్భక్తునికి సద్గురుచంద్రుని ప్రేమ సామ్రాజ్యంలో అంత చోటు చాలు. అనుక్షణం ఆస్వాదిస్తాడు. ఆ చంద్రతారార్కం చరిత్రలో అందమైన చోటు సంపాదిస్తాడు.

***విద్యార్థి–పరివర్తన :*** విద్యార్థి – అధ్యాపకుడి చెంతకు చేరతాడు. అ...ఆ...ఇ...ఈ... అంటూ తెలుగు అక్షరమాలతో మొదలైన సేకరణ – గణితం, సామాజికం, అర్థం ఇలా ప్రతీ అంశాల్లో ఉన్న



ప్రాథమిక సూత్రాలను నేర్చుకుంటాడు. ఎలా అంటే మనం ఒక చారిత్రక ప్రాధాన్యం ఉన్న ప్రాంతానికి వెళ్లాము. ఒక గైడ్‌ను ఆశ్రయిస్తాం. ఆయన చెపుతాడు ఎక్కడ ఏం ఉందో! ఎలా ఉందో! ఎందుకు అక్కడికి వచ్చిందో! అక్కడితో అతని పని అయిపోతుంది. ఆసక్తి మనకుందా, ఒక అడుగు మనం ముందుకు వేయాలి. ఒకటవ తరగతిలో అక్షరమాలతో మొదలై మెదడు ఎక్కడ ఉంటుంది! కంప్యూటర్ ఎలా పనిచేస్తుంది? వర్షం ఎలా కురుస్తుంది? ఇలా అంశాల సేకరణ, సమన్వయం ప్రాథమిక దశ. ఒక్కటే తేడా. సద్గురువు ఒడి అనే బడిలోకి, ఆయన ప్రేమ గుడిలోకి చేరడానికి మాత్రం ఆయనే మనలను పట్టుకుని అడ్మిషన్ ఇస్తాడు. పిచ్చుక కాలికి దారం కట్టి లాక్కొన్నట్లు, ఇక మన వంతు. ఆయన గుణగణాలు తెలిపే చరిత్ర. వారి జీవన విధానం తెలిపే ఆయన చర్యలు, సమర్ధత్వాన్ని తెలిపే లీలలు. సర్వజ్ఞత తెలిపే సందర్భాలు, సర్వ వ్యాపకతను ఎరుకపరిచే సవివర సాక్ష్యాలు. విద్యార్థిగా మిగలాలనుకుంటే ఈ పుస్తకాలు, రచనలు, ఫొటోలు... ఇత్యాదులన్నీ ప్రోగు చేసుకుంటే చాలు. ముందుకు వెళ్దామనుకుంటే ఇక్కడ మొదలవుతుంది పరివర్తనా క్రమం.

**'శిష్యుని' పరిణితి – నియతి :** సద్గురు సమర్ధత్వం తెలిసిన మనం ఆ లీలల్లోని జ్ఞానరత్నాలను వెతుక్కునే ప్రయత్నం చేస్తున్నామా? సర్వవ్యాపకత్వ మెరిగిన మనం సాటి జీవులలో సాయిని దర్శిస్తున్నామా? సర్వజ్ఞతను ఆసాంతం తొంగిచూసిన మనం కల్మష చిత్తాలతో, కపటమైన మనసులతో మెలగుతున్నామా? ఆ ఆనందస్వరూపుని దర్శించుకుంటున్న మనం అందరిలోనూ ఆనందాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నామా? ఆ విరాట్ పురుషుని చెంతన ఉంటున్నామంటూ – పుట్టుకకే పురుడు పోసుకుంటూ ఆయన ఉనికినే మరచిపోతున్నామా? జీవితాన్ని సవివరంగా విశ్లేషించుకుంటూ సద్గురువు చుట్టూనే ఆవర్తన చేసిన నాడు మనలో పరివర్తన (మార్పు) ఆయన ప్రేమంత సహజాతి సహజంగా చోటు చేసుకుంటుంది.

గురువు అడుగుజాడల్లో నడిచేవాడు శిష్యుడు. కేవలం జ్ఞాన సముపార్జన కోసమే ఆశ్రయించడు గురువును. అతని జీవితానికి ఒక 'త్రోవ'ను అన్వేషించే ప్రయత్నం చేసుకుంటాడు. తన లక్ష్యాన్ని తాను నిర్దేశించుకుంటాడు లేదా తెలుసుకుంటాడు–గురువు యొక్క దార్శనికతో. తనకు ఎదురు కాబోయే అవరోధాలను ఎలా ఎదుర్కోవాలో, అధిగమించాలో సద్గురు చరణ వినమ్రుడై తెలుసుకుంటాడు. అన్ని అంశాలను కూలంకషంగా, భేషజం లేకుండా మెప్పు–తప్పు బేధం లేకుండా అతని జీవితాన్ని నూతనంగా మార్చుకునే ప్రయత్నం చేస్తాడు. ఇదొక ప్రగతి బాట. ఒక వ్యక్తి – శక్తిగా మారే క్రమంలో తాను చేరిన పూదోట. తెలిసిన కథ ఒకటి చెపుతాను. ఇద్దరు వైద్య విద్యార్థులు ఉన్నారు. ఒకరు ఎప్పుడూ తన ఆచార్యునితో పాటే ఉంటూ ఉండేవారు. మరొకరు ఆచార్యుడు చెప్పింది విని వాటిని ఆచరించి, రోగుల బాగుకోసం శ్రమించేవాడు. ఒకరు ఎప్పుడూ ఆ ఆచార్యుని పొగుడుతూ, అనవసర సందర్భాలలో కూడా



అత్యుత్సాహాన్ని చూపేవాడు. మరొకరు అదే ఆచార్యుని విశ్లేషణలకై ఎన్ని గంటలైనా వేచి చూసేవాడు.. వైద్య శాస్త్రాన్ని కాచివడపోసేవాడు. సరే! కాలం కాని కాలం... పట్టాలు (డిగ్రీలు) ఇద్దరికీ వచ్చాయి. పట్టాలే నమ్ముకున్న వైద్యుని చెంతకు వెళ్లిన రోగులకు కష్టాలు మిగిలాయి. పట్టాలకు–శాస్త్రం తోడైన వైద్యుని చెంతకు వెళ్లిన వారికి చక్కని ఆరోగ్యాలు నేస్తాలయ్యాయి. సద్గురువనే వైద్యుని చెంత కూడా అంతే! మన మకిలి పట్టిన మనసులను శుద్ధిగావించేందుకు ఎన్నో అస్త్రాలు. నిత్య ప్రార్థన, మానసపూజ, సత్సంగం, స్మరణ, కీర్తన, పారాయణ, ధ్యానం... మనలో 'మార్పు'కు, జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించేందుకు కావాల్సిన 'నేర్పు'కు ఇవన్నీ సోపానాలు. అయితే మనలో 'పరిణితి' రావడం ఒక ఎత్తయితే ఇవన్నీ ఒక 'నియతి'తో ఆచరించిననాడే మనకు సాఫల్యం లభిస్తుందన్నది నిర్వివాదాంశం. వెలుగు, చీకటి, వర్షం, ఎండ, ఋతువులు, ఉదయం, అస్తమయం, ఇలా ప్రతిదీ ఒక నియతి కలిగి ఉన్నవే! ప్రకృతి నుంచి ఆ నియతిని నేర్చుకోగలిగితే జీవితంలోని ప్రతిక్షణము సద్గురు చరణ కైవల్యానికి మనం వేసే అడుగే అవుతుంది.

**'భక్తి' తత్పరత – 'శిష్య' పరిపూర్ణత :**

భక్తుడు – అనన్య ప్రేమికుడు. ఇతనికి జ్ఞాన సముపార్జన గూర్చిన చింతన లేదు. కైవల్యం వస్తుందా, రాదా! అన్న ప్రశ్న అసలే లేదు. అతనికి ఆయువు, ప్రాణవాయువు... గురువే! సద్గురువే! తన సర్వస్వమైన ఆతని జగద్గురువే! అతని రాజ్యం గురువు యొక్క ప్రేమ సామ్రాజ్యం. అతని నోటి మాట.. కేవలం గురువు చూపిన బాట. గురువు చూస్తే సంతోషం. ఒకానొక అంతులేని ప్రేమాంబుధిలో ఓలలాడుతున్నాడు. గురువు ఏమి ఇస్తాడన్న ధ్యాస లేదు. ఇస్తాడన్న అశ లేదు. జ్ఞానమా? కైవల్యమా? తన కనవసరం. తనకి కావాల్సింది గురువు. గురువు మాత్రమే! మిగిలినవన్నీ తృణప్రాయాలే! జీవం ఉన్నా లేనివే! గురువు చూపు తనపై పడితే చాలు! కెరటమై పోతాడు. గురువు మాట వినిపించిందా ఝంఝుమారుతమై పోతాడు! సద్గురు దర్శనమయ్యిందా తాను వెలిగిపోతాడు. సద్గురు చరణం చేరాడా తాను అమృతమయిపోతాడు.

ఆకలి తెలియదు, దప్పిక దరికి రాదు. చూసిన తర్వాత క్షణమైనా సరే గురువు నూతనంగానే దర్శనమిస్తాడు. గురువు చెప్పిన మాటను పాటించడానికి ప్రాణమివ్వాల్సి వస్తే తాను ప్రథముడవుతాడు. 'భయం' ఊసు తనను తాకలేదు – సద్గురు 'అభయం' మస్తిష్కంలో ముద్రించుకుపోయింది కనుక. తనకు ఏదైనా అందితే సద్గురు ప్రసాదమవ్వాలి. లేదంటే సద్గురు చంద్రుని ఆజ్ఞ లేదన్న అవగాహన అణువణువునా! ఒక్క ముక్కలో చెప్పాలంటే సద్గురువనే ప్రేమ పూదోటలో తాను పసివాడని పుష్పమని చెప్పాలి. ఎలా చెప్పను.. ఎలా చెప్పను.. ఆ.. తోటకుడవుతాడు.. తోటకాచార్యునిలా వర్ధిల్లుతాడు. సదా గురువు చుట్టూ పరిభ్రమించే తోటక వృత్తమవుతాడు. పూర్ణుడవుతాడు. పరి'పూర్ణుడుగా' వెలుగుతాడు.



గురుబంధువుల్లారా! అరుదుగా అనిపించిందా? కళ్ళముందు పూజ్య గురుదేవుల రూపం సాక్షాత్కరించడం లేదూ! తన ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో సాయి, సాయి అని సదా సమర్పణ భావంతో సాగిన వారి జీవితం మనకు వారందంచిన సాయి పద (పథ) కుసుమం. సదా సాయిపథగాములై, సదా సాయి చరణ వినమ్రులై సాగిన వారి జీవితాదర్శాలు మనకు నిత్య అనుసరణీయాలు. గురుపథంలో సమున్నతంగా సాగేందుకు దోహదపడే వారి వచనాలు శ్రీసాయిని చేరేందుకు దీపపు స్థంభాలు. శ్రీసాయిపట్ల వారికున్న శరణాగతి – మనకు వారందించిన సాయి'శృతి' (వేదం). పూర్ణమైన ఆ సద్గురుచంద్రుని ఆదర్శాలకు అంకితమయిననాడు మనకు నిజమైన గురుపూర్ణిమ. వారి అడుగుజాడల వెలుతురులో మన అడుగులను విశ్లేషించుకున్ననాడు అది విరబూసిన వెన్నెల. గురుపూర్ణిమ నిజానికి సాధకుని పుట్టినరోజు (జన్మదినం), ఒక నూతన జన్మకు శ్రీకారం. సద్గురు అనుగ్రహం సదా వర్షిస్తూనే ఉంది. మనం కట్టుకున్న అడ్డుగోడలే మనలను నియంత్రిస్తున్నాయి. అట్టి అడ్డుగోడ కూల్చేందుకు గురుపూర్ణిమ ఒక ప్రారంభమవ్వాలి. సద్గురుపథంలో సూటిగా సాగిపోయేందుకు మన సత్సంకల్పాలను క్రోడీకరించుకునేందుకు గురుపూర్ణిమ సుదినమవ్వాలి.

గురుబంధువుల్లారా! పదండి పోదాం శీలధికి. ఆ సద్గురుచంద్రుని పూర్ణానుగ్రహపాత్రులమవుదాం. సద్గురు స్మృతులలో ధన్యులమవుదాం, పరివర్తనతో సద్గురు ప్రసాదాన్ని స్వీకరించి పరిణితితో ప్రతీ అడుగును విశ్లేషించుకుని పూర్ణులమవుదాం. సర్వులకు గురుచరణామృత ప్రాప్తిరస్తు!! శుభం భవతు. ***'గురుకృప'***

*మనలో కొంతమంది సద్గురువునాహ్వానించి (ధ్యానమున) మనకున్న సమస్తమైనటువంటి బాధల్ని కుండపోతగా వారి ముందు పోస్తూ ఉంటాం. చాలా సేవ చేస్తున్నాము కదా! "మాకెందుకీ బాధలు, కష్టాలు" అని ప్రశ్నించెదరు. ఇటువంటి సత్యభామ బుద్ధి (ఆరోపణ బుద్ధి) మానుకోవడం ఉత్తమం. ఆరోపణలు చేయడానికి ఆవాహనమెందుకు? ఎప్పుడూ ఆరోపణలు చేసే వారి దగ్గరికి మనకు వెళ్లబుద్ధి అవుతుందా? కాని దైవానికి వెళ్ళబుద్ధి అవుతుంది. పిలిస్తే వస్తాడు కానీ మీ బాధలు, ఆరోపణలు ఆయన రాకను గుర్తింపనీయవు.*

*మనం (మీరు) బాధలలో ఉన్నప్పుడు చేయవలసినదల్లా వారందించిన బోధనలను (లీలలను) చదువుకొనుచూ, మనో ప్రశాంతత, మనో వైశాల్యతను పొందుచుండవలయును. అట్లు కానిచో, క్రమంగా భక్తి తగ్గును, అనుమానం పెరుగును. చేతన ఘర్షణకు గురి అగును.*

*వారు అనంత ప్రేమను, ఆదరణను ఎప్పుడూ ప్రసరించుచునేయుందురు. వారిలో అనుసంధానమును పెంచుకొనవలయును. కాని ఆరోపణలతో తెంపుకొనరాదు. ప్రతి నిత్యము ఉల్లిపాయలు కోయుచూ, ఏడ్చుచున్న వారివలే మనం వారికి గోచరించెదము. దీనివలన ఎట్టి ప్రయోజనమూ లేదు.*



## మహాత్ముల జీవిత చరిత్రలు ఏప్రిల్ 2014



**భక్తుడు** : గురువుగారూ! మీరు ఎప్పుడైనా ప్రత్యేకమైన పుస్తకాలనుగానీ, లేదా శాస్త్రాలను గానీ చదవమని సూచిస్తారా?

**గురువుగారు :** మీరు ఏదో చెయ్యాల్సిన అవసరం ఉంది అని మీకు అనిపించిందనుకొందాం. నా దృష్టిలో ఆ అవసరమనేది రెండు రకాలుగా ఉంటుంది. ఎవరికైతే వారిలోని ప్రేమను ప్రేరేపించగల సద్గురువు ఇంకా దొరకలేదో వాళ్లది మొదటి రకమైన అవసరం. వీరు తమ సద్గురువును చేరుకొనేవరకు మహాత్ముల లక్షణాల గురించి అస్పష్టంగానైనా ఒక అవగాహన కలుగుతుంది, లేదా వారిలో ప్రేమను కలిగించేటటువంటి ఆ సద్గురువును తెలుసుకోవడమైనా జరుగుతుంది. ఇక రెండవ రకానికి వస్తే, ఒక్కసారి సద్గురువు దొరికి ఆ ప్రేమ కలిగాక, ఆయనకు సంబంధించినది ఏదైనా సరే, దాని గురించి మరింతగా చదవాలనిపిస్తుంది. అలా చదవడం అనేది వారి ప్రేమకు వ్యక్తీకరణ అవుతుంది. అంతేకాదు, ప్రేమను మరింతగా పెరిగేటట్లు చేస్తుంది.

"గురువుగారూ! మీరు ఎక్కడ పుట్టారు? మీ గురువును ఎక్కడ కలిసారు, మీ గురించి ఇంకా ఎక్కువ తెలుసుకోవాలనుకుంటున్నాము"... అని ఇలా మీరు నన్ను అడుగుతూ ఉంటారు. ఈ ప్రశ్నలన్నీ ఏమిటి? అసలు మీకు నిజంగా ఈ విషయాలన్నీ తెలుసుకోవాల్సిన అవసరం ఉందా ఏమిటి? అవేమైనా అంత ముఖ్యమైన విషయాలా? కానే కాదు. అలా తెలుసుకోవాలనుకోవడం మీకు నామీదున్న ప్రేమకు వ్యక్తీకరణ మాత్రమే. కాబట్టి మొదటి దశలో (సద్గురువును చేరుకొనేముందు) చదవడమనేది ఒక విధంగా ఉంటుంది. రెండవ దశలో (చేరుకున్నాక) అది మరోవిధంగా ఉంటుంది. కానీ సాధారణంగా ఎవరికైనా చదవాలి అనిపించినపుడు, వాళ్ళు మహాత్ముల జీవిత చరిత్రలను చదవడానికే నేను ప్రాముఖ్యతనిస్తాను, ఎందుకంటే అవి యదార్ధమైనవి. ఉదాహరణకు రమణమహర్షిని తీసుకుందాం. ఆయనపట్ల మనకు గల అవగాహన ఏదైనా, అది ఆయన జీవితం మీద ఆధారపడి ఉండాలి, ఆయన ఎలా జీవించారు అనే దానిపైన ఆధారపడి ఉండాలి. ఎందుకంటే అది (ఆయన జీవితం) వాస్తవం కాబట్టి, మనలో సద్గురువు పట్ల ప్రేమ జనించక ముందు మనం చదవడమనేది నేను చెప్పిన మొదటి రకం. అది ప్రేమ కోసం అన్వేషించడం! మనం ఆ ప్రేమ పొందిన తర్వాత కూడా మనం చదువుతూ పోతే అది మన ప్రేమకు వ్యక్తీకరణ అవుతుంది.

**గురుని ఒక్క స్పర్శ, ఓ కడగంటి చూపు, ఒక్కమాట - మానవనైజాన్ని పూర్తిగా మానవత్వంవైపు మరలిస్తుంది.**



భగవాన్ రమణులు కూడా మహాత్ముల జీవిత చరిత్రలు చదవమనే చెప్పేవారు. ఒకరోజు ఒక పాశ్చాత్య భక్తుడు భగవాన్ సన్నిధిలో కూర్చుని బ్రహ్మసూత్ర భాష్యాన్ని చదువుతున్నాడు. ఆ సమయంలో హాలులో ఇంకెవ్వరూ లేరు. భగవాన్ ఇంగ్లీషులో మాట్లాడిన అరుదైన సందర్భాలలో అది ఒకటి. భగవాన్ అతన్ని, "మీరు చదువుతున్నదేమిటి?" అని అడిగారు. దానికి అతను, "నేను బ్రహ్మసూత్ర భాష్యాన్ని చదువుతున్నాను..." అన్నాడు. అప్పుడు భగవాన్ అతనితో, "లైబ్రరీకి వెళ్లి మిలారెపా జీవిత చరిత్రను చదువవచ్చును కదా?" అని అన్నారు. అంతకు ముందటి సంవత్సరం, ఇవాన్ వెంజ్ రమణాశ్రమాన్ని సందర్శించి తాను రచించిన 'మిలారెపా జీవిత చరిత్రను' భగవాన్‌కు సమర్పించాడు. భగవాన్ ఇప్పుడు ఈ పాశ్చాత్య భక్తునితో, "లైబ్రరీకి వెళ్లి ఆ పుస్తకాన్ని చదువు" అని చెప్పారు. ఇతర సన్నిహిత భారతీయ భక్తులకు కూడా మహాత్ముల చరిత్రలను చదవమని భగవాన్ చెప్పేవారు. రమణులను సైతం ప్రభావితం చేసింది మహాత్ముల జీవిత చరిత్రలే. బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తుల కన్నా 63మంది నాయనార్ల (శైవభక్తుల) జీవిత చరిత్రలతో తమిళంలో రచింపబడిన 'పెరియపురాణం' రమణులను ఎక్కువ ప్రభావితం చేసింది. అందులో వేదాంత అంశాలు లేశమాత్రమైనా ఉండవు.

'శ్రీరమణలీల' పేరుతో తెలుగులో ప్రామాణికమైన భగవాన్ జీవిత చరిత్రను రచించిన కృష్ణభిక్షు అనే భగవాన్ సన్నిహిత భక్తుడు ఒకసారి నాతో ఇలా అన్నారు : వారొకసారి భగవానులను, "భగవాన్, ఇప్పుడు మీ సన్నిధిలో మేమెంతో ఆనందంగా ఉన్నాము. మరి మీరు వెళ్లిపోయిన తరువాత మా పరిస్థితి ఏమిటి?" అని ప్రశ్నించారట. దానికి భగవాన్ తక్షణమే, "దానికేముంది, చరిత్ర ఉంది కదా" అన్నారట. భగవాన్ తమ జీవిత చరిత్రను దాదాపు తమకు ఒక సూక్ష్మమైన ప్రత్యామ్నాయంగా సూచించారు. అలా భగవాన్ మరోసారి, మహాత్ముల జీవిత చరిత్రల ప్రాముఖ్యతను తెలియచేసారు.

**భక్తుడు** : గురువుగారూ! పుస్తకాల ద్వారా బాబాను నిజంగా తెలుసుకోవడం అసంభవమేమో కదా.

**గురువుగారు :** అది మీరు బాబాను ఏ విధంగా తెలుసుకోవాలనుకుంటున్నారు అనే దానిమీద ఆధారపడి ఉంటుంది. మీరు బాబా జీవితాన్ని గురించి తెలుసుకోవాలనుకుంటున్నారా? అలాగైతే పుస్తకాల ద్వారానే తెలుసుకోగలరు. మరి అలా కాకుండా ఇంకెలా తెలుసుకోగలరు?

**భక్తుడు** : గురువుగారూ! నిన్న నేను గురుస్థాన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నపుడు బాబాను నిజంగా తెలుసుకోవడం నాకు సాధ్యమవుతుందా అనిపించింది. బాబా గురించి పుస్తకాలలో చదివేది కాకుండా ఇంకేదో ఉందని నాకనిపించింది. కానీ అదేమిటో నాకు తెలియడం లేదు.

**గురువుగారు :** మీరు ఎంతో 'కొంత' తెలుసుకున్నారు కాబట్టే 'ఇంకా ఇంకా' అనే ప్రశ్న వస్తోంది.

**ప్రాపంచిక విషయాలపై శ్రద్ధ కలిగి ఉండటాన్ని ప్రేయస్సు అంటారు.**

ముందుగా పుస్తకాలలో ఉన్న విషయాలను తెలుసుకుందాం. ఆ తరువాత, మీకింకా తెలుసుకోవాలనిపిస్తే అప్పుడు చూద్దాం. పుస్తకాలు చదవడం అనవసరమని ముందే అనుకోవడం కరెక్టేనంటారా? బాబాకు సంబంధించిన విషయం – అది పుస్తకాలలో ఉన్నా లేదా ఎవరైనా వాచా చెబుతున్నా – అది ఏదైనా సరే, మనకది ముఖ్యమైనదే. దానికి ఎందుకంత ప్రాముఖ్యతనిస్తాం? ఎందుకు నువ్వు బాబా గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు? ఎందుకంటే నువ్వు బాబాను ప్రేమిస్తున్నావు కాబట్టి. ఇవన్నీ బాబాపట్ల మీకుండే ప్రేమను పెంపొందిస్తాయి. మీలో అస్పష్టంగా ఉండే ఆ సంపూర్ణత్వ భావనను మరింతగా స్పష్టంగా అనుభవమయ్యేలా చేస్తాయి.



కాబట్టి నా దృష్టిలో మహాత్ముల జీవితాన్ని గురించి తెలుసుకోవడమనేది కూడా చాలా ముఖ్యమైనదే. బాబా ఎక్కడ నివసించారు, ఆయన మొదట ఎప్పుడు వచ్చారు, ఆయన ఎక్కడ కూర్చునేవారు, ఎలా కూర్చునేవారు, ఆయన ఏం తినేవారు, ఏం చేసేవారు, ఎక్కడకు వెళ్లేవారు, ఏం మాట్లాడేవారు, కేవలం ఆయన మాటే కాదు... చివరకు ఆయన కాలకృత్యాలు ఎక్కడ తీర్చుకునేవారు అనేది తెలుసుకోవడం కూడా మనకు ముఖ్యమేననిపిస్తుంది. ఈ రోజు ఆ ప్రదేశం కూడా పవిత్రమైనదే. అదే లెండీబాగ్. ఆయనకు సంబంధించినది ఏదైనా మనకు ప్రియమైనదే. పవిత్రమైనదే. అలా తెలుసుకోవాలనిపించడం మన ప్రేమ యొక్క వ్యక్తీకరణ. మీరు ఖండోబా మందిరానికి ఎందుకు వెళతారు? బాబా అక్కడ ఎప్పుడైనా నివసించారా? ఏమిటి ఆ మందిరంతో మీకు సంబంధం? ఖండోబా మందిరంలో బాబా కేవలం ఒకటి రెండుసార్లు అడుగుపెట్టారు. కాబట్టి దానికంత ప్రాధాన్యతనిస్తాం. అలా మనకు ఇష్టమైన దాని గురించి తెలుసుకోవడం, అది ఏదైనా సరే, మనకు ముఖ్యమేననిపిస్తుంది. ఇంకా ఇంకా తెలుసుకోవాలని మనకు ఆత్రంగా ఉంటుంది, అలా తెలుసుకోవాలనుకోవడం మనకు ఒక తప్పనిసరి అవుతుంది. ప్రేమ యొక్క గుణమది, లక్షణమది. మన ప్రేమ తనకు తానుగా వ్యక్తం కావడానికి, అది పెరగడానికి ఇది ఒక ప్రభావవంతమైన మార్గం.

మీలో ప్రేమ ఉన్నప్పుడు మీరు ప్రేమించేదాన్ని గురించిన పుస్తకాలను ఆసక్తితో, కుతూహలంతో చదువుతారు. మీరు ఒక పుస్తకాన్ని ఇష్టంతో చదివితే మీకు దానిలోని ప్రతి అంశం గుర్తు ఉంటుంది. అలా కాకపోతే మీరు ఎన్నిసార్లు చదివినా మీకు ఏదీ గుర్తుండదు. కాబట్టి ప్రేమ ఉంటే తెలుసుకోవడం సులభమవుతుంది. మీరు నిజంగా బాబాను ప్రేమిస్తే, ఆయనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ తెలుసుకోగలుగుతారు.

**భక్తుడు** : గురువుగారూ! ప్రాపంచికంగా ఏదైనా సాధించాలంటే మనం నడవవలసిన దారి, వేయవలసిన అడుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ ఆధ్యాత్మిక లక్ష్యం దగ్గరకు వచ్చేటప్పటికీ అవి అంత స్పష్టంగా ఉన్నట్లనిపించడంలేదు.



**ప్రేమ - బేధాన్ని చూడదు, చూపదు.**



**గురువుగారు :** అవి కూడా అంతే స్పష్టంగా ఉంటాయి. నేను చెబుతున్నాను, బాబా గురించి తప్ప మరేదాని గురించి ఆలోచించకండి, ఎప్పుడూ బాబా మీదనే మనస్సును లగ్నం చేయండి. మీరు మాట్లాడవలసి వస్తే, బాబా గురించి మాట్లాడండి. ఆలోచిస్తే బాబా గురించి ఆలోచించండి. ఏదైనా చదివితే బాబా గురించి చదవండి. బాబా జీవిత చరిత్ర చదవండి. మీకు అర్థమవుతుంది. ***ఆయన గురించే మాట్లాడండి, ఆలోచించండి, చదవండి – ఈ మూడే.*** చూడండి. స్పష్టంగానే ఉంది కదా. ఇది ప్రాపంచికంగా డబ్బులు సంపాదించడం కన్నా తేలిక. మీ గమ్యాన్ని ఎలా చేరుకోవాలో చెప్పాను. సింపుల్! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు** : గురువుగారూ! బాబా గురించి ఆలోచించడానికి, మాట్లాడటానికి ఆయన గురించిన స్పష్టమైన అవగాహనగానీ, అనుభవంగానీ ఉండాలి కదా?

**గురువుగారు :** అందుకనే బాబా జీవిత చరిత్ర చదవడం, సత్సంగానికి వెళ్లడం మొదలైన మార్గాల ద్వారా బాబాతో కాంటాక్ట్‌లో ఉండమని చెప్తాను. దానివలన మీకు బాబా పట్ల స్పష్టమైన అవగాహన కలిగి, ఆయనను మీరు స్పష్టంగా అర్థం చేసుకోగలుగుతారు.

**భక్తుడు** : ఎవరైనా అలా హృదయపూర్వకంగా మనస్సును బాబా మీద లగ్నం చెయ్యాలంటే, బాబా మన జీవితంలోని ప్రతి అంశంతో ఎలా మమేకమై వున్నారో తెలియాలి కదా, బాబా అంటే భూమిపై జీవించి, సమాధి చెందిన భౌతికదేహం మాత్రమే కాదని అంతకుమించిన వారనీ, మీరు కూడా చాలా సందర్భాలలో చెప్పారు.

**గురువుగారు :** అది సరే, కానీ ఆయన ఎలా మన జీవితాలలో మమేకమై వున్నారు, అసలు మమేకమయ్యారా లేదా... ఇటువంటి విషయాల గురించి ప్రస్తుతానికి ఆలోచించవద్దు. ఇప్పుడు నేను మిమ్మల్ని బాబా మీద దృష్టి పెట్టమంటున్నాను. ఒకసారి ఒక వ్యక్తి నా వద్దకు వచ్చి, "నేను ఇబ్బందుల్లో ఉన్నాను, నాకు డబ్బులు కావాలి" అని అడిగాడు. దానికి నేను, "సరే, నేను నీకో ఉద్యోగం ఇస్తాను" అన్నాను. దానికి అతను, "నేను మిమ్మల్ని డబ్బులు అడుగుతున్నాను, ఉద్యోగం కాదు" అన్నాడు. (నవ్వులు..) "అవును, నేను నీకు ఉద్యోగం ఎందుకు ఇస్తున్నానని అనుకుంటున్నావు? ఆ డబ్బుల కోసమే" అన్నాను. ఇదీ అలాంటిదే. మీరు కోరుకునే స్థితి ఏదైనా సరే, నేను మిమ్మల్ని బాబా మీద దృష్టి పెట్టమంటున్నాను. అది మీకు నచ్చినా నచ్చకపోయినా, నేను మీకు అప్పగిస్తున్న పని అది – అలా చెయ్యండి చాలు.

**భక్తుడు** : గురువుగారూ! శ్రీరమణమహర్షి, శ్రీరామకృష్ణపరమహంస మొదలైన గొప్ప మహాత్ముల గురించి చదివినపుడు, వారి జీవితాలలో వారెంతో కష్టపడినట్లు కనిపిస్తుంది. మీరు గతంలో ఒకసారి, "మీకు ఎన్నుకునే అవకాశం ఉంటే నిజంగా మీరు రమణమహర్షిలా జీవించడానికి సిద్ధమా?" అని అడిగారు. రమణమహర్షి పొందిన స్థితిని పొందాలనే ఆకాంక్ష నాకున్నా, ఆ క్రమంలో అన్ని కష్టాలు భరించడానికి

నేను సిద్ధమేనా అని నాకే సందేహంగా ఉంది.



**గురువుగారు :** ఆయన పొందిన స్థితి ఏమిటి? నీకదేదో తెలిసినట్లే మాట్లాడుతున్నావు.

**భక్తుడు :** నాకు తెలియదు. కానీ ఏదో పొందాలనే ఆకాంక్ష ఉంటుంది కదా.

**గురువుగారు :** అలాంటప్పుడు మీ పరిపూర్ణత్వం కోసం మీరు ప్రయత్నించండి. వాళ్ళు వాళ్ళ పరిపూర్ణత్వం కోసం ప్రయత్నించారు. అందుకనే నేను ఎవ్వరినీ రమణమహర్షిగానో లేదా రామకృష్ణులుగానో కమ్మని చెప్పను. మీ పరిపూర్ణత్వం వల్ల మీకొక అస్పష్టమైన భావమేదో ఉంది, దానిని మీదైన మార్గంలో అనుభవంలోనికి తెచ్చుకోవడానికి ప్రయత్నించండి. లేకపోతే అది అనుకరణవుతుంది.

**భక్తుడు :** కానీ మహాత్ముల జీవిత చరిత్రలను చదవడం ప్రయోజనకరంగా ఉంటుంది కదా?

**గురువుగారు :** ప్రయోజనం ఉంది. కానీ మనం అక్కడ వారి నిబద్ధతను, అంకితభావాన్ని చూడాలి. వారి ఆచరణ ఎంత తీవ్రంగా ఉందో చూడాలి. ఒకవేళ ఎవరైనా వచ్చి, "అంత తీవ్రంగా ప్రయత్నించవద్దు, కాస్త నెమ్మదించు లేకపోతే అందరూ నిన్ను పిచ్చివాడు అంటారు, ప్రతిదానికీ ఒక హద్దు ఉండాలి" అని మీకు హితబోధ చేశారనుకోండి. అప్పుడు ఆ మహాత్ముల జీవితాలు మీకు దారి చూపే దీపం కావాలి. ఆ స్థితి గనుక మీకు కావాలనుకుంటే, ఆ ప్రయత్నం (సాధన) కూడా అంత తీవ్రంగా ఉండాలి. ఆ తీవ్రత చూసి అందరూ నిన్ను పిచ్చివాడు అని అనుకోవచ్చు కూడా. అయితే ఏమిటట? అలా కాదంటారా, పూర్తిగా ఆ విషయాన్ని వదలిపెట్టేయండి. మధ్యేమార్గం అన్న ప్రశ్నే ఉండకూడదు. మీరు ఆ మహాత్ముల వంటి సత్యాన్వేషకులు అనుకొని మాత్రం మిమ్మల్ని మీరు మోసం చేసుకోవద్దు. "రమణమహర్షి ఆత్మవిచారణ చేశారు. నేనూ ఆత్మవిచారణ చేస్తున్నాను, రామకృష్ణులు కాళీమాత కోసం ఎంతగానో విలపించారు, నేనూ అలా భగవంతుని కోసం విలపిస్తున్నాను. బుద్ధుడు సత్యాన్వేషణ చేసాడు, నేనూ సత్యం కోసం అన్వేషిస్తున్నాను" అని అనుకోవద్దు. మీరు చెయ్యటం లేదు! వారి నిబద్ధత, అంకితభావం, వారి ఆచరణ, ఇవీ మనం వారి జీవితాల నుండి నేర్చుకోవలసింది. అంతేగానీ వారిని అనుకరించడం కాదు.

**భక్తుడు :** కానీ వారి విషయంలో అలా ఉండకుండా వారు చేయగలిగినది ఏమీ లేనట్లు అనిపిస్తుంది.

**గురువుగారు :** నిజంగా వారు ఏదైనా చేసుకోగలిగి వుంటే, వారు అలా ఉండి ఉండేవారు కాదు. (నవ్వులు...) మనలాంటి వాళ్ళం మనకు మనం సాయం చేసుకోగలం కాబట్టే ఇలా ఉన్నాం. చాల పద్ధతిగా, హేతుబద్ధంగా, నిలకడగా ఉన్నాం. ఏమంటారు...? వారిలో తీవ్రత ఎంతగా ఉందంటే వారు తమకు తాము ఏమీ చేసుకోలేకపోయారు. అందుకనే వారిని కొంతమంది పిచ్చివాళ్ళన్నారు.

**భక్తుడు :** గురువుగారూ! మహాత్ములకు ఇష్టాయిష్టాలు ఉంటాయా?

**గురువుగారు :** వాళ్లకి ఇష్టాయిష్టాలు ఉండవు అని అంటారు. రమణమహర్షి, ఏదైనా కోరడానికి తమకు అసలు సంకల్పించే మనసే లేదన్నారు. అటువంటప్పుడు వారికి ఇష్టాయిష్టాలు ఏముంటాయి?



సరే, ఒకవేళ వారికి ఇష్టాయిష్టాలు ఉన్నాయనుకొందాం. అయితే ఏమిటట? అవి ఏవైనాగానీ, మనమందరం వాళ్లలాగా కావాలన్న ఆకాంక్ష మాత్రం వారికి తప్పకుండా ఉంటుంది. అందరూ ఆనందంగా, స్వేచ్ఛగా ఉండాలి అనే దానికే వారి తొలి ప్రాధాన్యం – వారికి ఇష్టమైనది అది. మంచిదే కదా! అందులో తప్పేమీ లేదు.

మహాత్ముని స్థితి గురించి ఎందుకు మీరు ఎప్పుడూ ఆలోచిస్తుంటారు? మీరది తెలుసుకోవడం నిజంగా సాధ్యమవుతుందా? మహాత్ముని స్థితి ఏమిటో, ఆయన ఏమి, ఎలా చేస్తారో మీరు తెలుసుకోవడానికి అవకాశం లేదు. ఒకసారి భగవాన్‌ను ఒక భక్తుడు, జ్ఞాని యొక్క స్థితి గురించి అడిగినపుడు, భగవాన్ కూడా, "మీరు జ్ఞానాన్ని పొందినపుడుగానీ, జ్ఞాని ఏ స్థితిలో ఉన్నారో తెలుసుకోలేరు. ఈశ్వరుడు ఎలా పనిచేస్తాడు వగైరా ప్రశ్నలడగడం వలన ప్రయోజనం లేదు. ఒకవేళ నేను చెప్తేమటుకు మీరు దానిని అర్థం చేసుకోగలరా?" అన్నారు. నేను మళ్ళీ మళ్ళీ చెబుతున్నాను, మీ పని మీరు చూసుకోండి. మీ సమస్యేమిటో మీరు తెలుసుకోండి. దాన్ని పరిష్కరించుకోవడానికి ప్రయత్నించండి. దాని వరకే మనల్ని మనం పరిమితం చేసుకుందాం. దాని మీదనే దృష్టి పెడదాం.

**భక్తుడు** : కానీ మహాత్ముని స్థితి గురించిన ప్రశ్నలడగడమనేది మేము దేనికోసం తపిస్తున్నామో దాని గురించి తెలుసుకోవాలి అన్న మా ఆకాంక్షకు ఒక వ్యక్తీకరణే కదా.


**గురువుగారు :** దానిని సంతృప్తి పరచడానికే మహాత్ముల చరిత్రల పారాయణ చేసేది. ఆ తపన నిలుపుకోండి, అన్వేషించండి. కానీ మీరు కేవలం అన్వేషిస్తున్నారు అన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. మీకు తెలుసు అనుకొని ఏవేవో నిర్ధారణలు చేసుకోవడానికి ప్రయత్నించవద్దు. మీరు ఆ స్థితిని గురించి అడిగితే నేను చెప్తాననుకోండి. మీరు దాన్ని నిజం అనుకొని మీకు తెలుసు అనుకుంటారు. మీ అన్వేషణ అక్కడితో ఆగిపోతుంది. బాబాకు ఇష్టాయిష్టాలున్నాయో లేదో మీకు నిజంగా తెలుసుకోవాలని ఉంటే, అన్వేషించండి! వెళ్లి బాబా జీవిత చరిత్రను చదవండి. ఒకసారి, రెండుసార్లు, మూడుసార్లు, వందసార్లు, వెయ్యిసార్లు చదివి, తెలుసుకోవడానికి ప్రయత్నించండి. మీకు సమాధానం దొరికితే నాకు చెప్పండి. అప్పుడు నేనూ తెలుసుకుంటాను. అది నిజమైనా, కాకపోయినా నేను కూడా మళ్ళీ దాని గురించి అన్వేషిస్తాను. మీ మనస్సులు ఎలా తయారయ్యాయంటే వాటికి కేవలం సమాధానాలు మాత్రమే కావాలి. అది మీలో తెలుసుకోవాలనుకునే స్ఫూర్తిని, థ్రిల్‌ను, ఉత్తేజాన్నీ చంపేస్తుంది. సంశయాలు ఉండటం మంచిది, వాటి సమాధానాలకోసం చేసే ప్రయత్నం ఎంతో అద్భుతంగా ఉంటుంది! అన్వేషించండి!


సాయి సమగ్రదర్శిని : **www.saibaba.com** సద్గురు తత్త్వ దర్శిని : **www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

# సరైన ప్రయత్నం - మే 2014





**గురువుగారు :** అనేక మత సిద్ధాంతాలలో నిర్వాణస్థితి అనేది క్రమేణా వస్తుందా లేక ఆకస్మికంగా వస్తుందా అనే విషయంపై స్పష్టత లేదు. కొంతమంది అది 'సటోరి'లా (అంటే జపనీస్ బుద్ధిజంలో ఆత్మ సాక్షాత్కారం) ఆకస్మికంగా వస్తుంది అని అంటే, మరి కొంతమంది అది అలా జరగదని, అది క్రమేపీ దశలవారీగా వస్తుందని, బుద్ధునికి కూడా అలానే వచ్చిందని చెప్తారు. ఇంకొందరు దీనికి ఒప్పుకోరు. బుద్ధునికి నిర్వాణం ఒక్కసారిగా వచ్చిందని, అది అప్రయత్నంగా, ఆకస్మికంగా వచ్చిన నిర్వాణమనీ, చెప్తారు. ఇంతకీ ఏది నిజం? ఆ నిజం ఈ రెండింటి మధ్యలో ఉంటుంది.

మీకు ఉదాహరణ ఇస్తాను ; మామిడితోటకు వెళ్లి, ఒక చెట్టుకి చక్కగా పండిన మామిడి పండును చూశారు. దానిని రాల్చడానికి మీరు ఒక రాయిని తీసుకొని గురి చూచి విసిరారు. అది మామిడిపండుకు తగలలేదు. ఇంకొక రాయిని విసిరారు, మళ్ళీ తగలలేదు. ఇలా ఏడు, ఎనిమిది, తొమ్మిదిసార్లు జరిగింది. మీరు విసిరిన పదవరాయి ఆ మామిడిపండుకు తగిలి అది రాలిపడింది. ఇప్పుడు చెప్పండి; ఆ మామిడిపండు పది రాళ్ళకు క్రిందపడిందా లేక ఒక్కరాయికి పడిందా? చెప్పండి! ఒక్క రాయితోనే రాలిందంటే మీరు విసిరిన మొదటిరాయికే అది రాలి ఉండాలి కదా. అలా కాదు, పది రాళ్ళకు పడింది అంటే పది రాళ్ళూ దానికి తగిలాయా? లేదు. అది కేవలం ఒక్క రాయికే క్రింద పడింది. కానీ విషయమేమిటంటే, ఆ మామిడిపండుకు పదవరాయి తగిలింది. తద్వారా పదవరాయి లక్ష్యానికి తగిలింది. ఒక్కసారి ఆ రాయి ఆ పండుకు తగిలితే చాలు అది క్రింద పడుతుంది. కానీ ఈ మొత్తం ప్రక్రియంతా కూడా ఆ పండును కొట్టగలిగే కళను నేర్చుకోవడమే. కొంతమందికి పదిరాళ్ళు అవసరం కావచ్చు. ఇంకొకరికి మూడు, ఇంకొందరికి వంద రాళ్ళు, వెయ్యి రాళ్ళు కూడా అవసరం కావచ్చు లేదా కేవలం ఒక్క రాయే సరిపోవచ్చు. మీకు నిజంగా ఆ మామిడిపండు కావాలంటే, మీరు ఆ కళను నేర్చుకునేవరకు, ఆ పండును కొట్టేవరకు రాళ్ళు విసురుతూనే ఉంటారు. నేను వాడిన పదాలను జాగ్రత్తగా గమనించండి. నేను దానిని 'కళ' అని అంటున్నాను, సామర్థ్యం అనటంలేదు.

**భక్తుడు** : గురువుగారూ, కళ అంటే?

**గురువుగారు :** మీరు బాడ్మింటన్ ఆడతారు కదా? షటిల్‌కాక్ మీవైపు వచ్చినపుడు, అది ఏ కోణంలో వస్తుంది, ఎంత బలంగా వస్తుంది మొదలైన విషయాలను ఆలోచిస్తారా? దాని ద్రవ్యరాశి ఎంత, ఎదురుగాలి

వేగమెంత, రాకెట్ యొక్క ఉపరితల విస్తీర్ణత ఎంత అని ఇవన్నీ లెక్కవేసి, అప్పుడు దాన్ని కొడతారా? ఎవరైనా అలా చేస్తారా? (నవ్వులు...)



క్రొత్తగా ఆడేవాళ్ళు షటిల్‌కాక్ వారివైపు వచ్చినపుడు దానిని కొట్టలేరు. కానీ ప్రాక్టీస్ చేసేకొద్దీ దాన్ని తిరిగి ఎలా కొట్టాలనే కళను నేర్చుకుంటారు. షటిల్‌కాక్ మీ వైపుకు వచ్చిన తక్షణం, మీరు సునాయాసంగా నెట్ అవతలికి పోయేలాగా కొట్టగలుగుతారు. మీకు తెలిసిపోతుందంతే. మంచి ఆటగాడు ఒక కళాకారుడులాంటి వాడే. ఎందుకంటే అతను ఎలాంటి లెక్కలు వేయడు.

**భక్తుడు :** గురువుగారూ, మా లక్ష్యాన్ని సాధించడం కోసం మేము ప్రయత్నం చెయ్యడానికి, ఆ లక్ష్యం ఏమిటన్నది మీకు ముందుగా అనుభవమైగానీ, లేదా లీలగానైనా తెలిసి ఉండాల్సిన అవసరంగానీ ఉంది కదా?

**గురువుగారు :** అవసరం లేదు. మీ ప్రస్తుత స్థితితో మీకు నిజంగా అసంతృప్తి కలిగివుంటే, అది చాలు. మీకు దేన్నో పొందాల్సిన అవసరమన్నా ఉండాలి లేదా మీలో ఏదో తొలగించుకోవాల్సిన అవసరమన్నా ఉండాలి. చాలా సందర్భాలలో ఈ రెండూ ఉండవు. నిజంగా దేనినైనా పోగొట్టుకోవాలని మనకు అంతటి ఆరాటమూ ఉండదు. అలాగే ఏదైనా పొందడానికి అంత తపనా ఉండదు. మనం సాధన అని దేనినైతే అనుకొంటున్నామో, అది ఒక మొక్కుబడిగా, యాంత్రికంగా ఉండి మన హృదయాలను కదిలించనిదిగా ఉంటుంది. ప్రయత్నం అవసరం లేదు అని నేను చెప్తున్నది, అలా యాంత్రికంగా చేసే ప్రయత్నం గురించి. కానీ మీలో ఒక విషయంపట్ల ప్రేమ కలిగినపుడు, లేదా మన ప్రస్తుత స్థితి భరింపరానిదిగా మారి మీరు దాని నుండి బయటపడాలని భావిస్తున్నపుడు – అదే సరైన ప్రయత్నానికి ఆధారమవుతుంది.

మీరు నీటిలో మునిగిపోబోతున్నప్పుడు, మీకు గడ్డిపోచ దొరికినా అది మిమ్మల్ని ఒడ్డుకు చేరుస్తుందని ఆశించి, దానిని పట్టుకుంటారు – మీకు అంతకంటే దారిలేదు. “నేను ఇంత బరువున్నాను, వరద ఇంత వేగంగా ఉంది, ఈ గడ్డిపోచ నన్ను నిజంగా కాపాడగలుగుతుందా?” అనే విషయాలన్నీ మీరు ఆలోచించరు. మీ చేతికి ఏది అందితే దాన్ని గట్టిగా పట్టుకుంటారు. అవసరం అంత తీవ్రంగా ఉన్నప్పుడు ఆ ప్రయత్నం కూడా ఆకస్మికంగా వస్తుంది.

మీలో ప్రేమ కలిగినపుడు, దానిని ఇంకా ఎక్కువ అనుభవంలోకి తెచ్చుకోవాలని, దానిని ఇంకా ఇంకా వ్యక్తపరచాలని అనుకొంటావు. ఇదంతా బయట నుండి చేస్తే ప్రయత్నంలా కనిపిస్తుంది. కానీ అది నిజంగా ప్రయత్నం కాదు. నేను దానిని వ్యక్తపరచడం అంటాను. ప్రయత్నం అనే పదంలోనే ఒక లక్ష్యం, సాధన, మార్గం ఇవన్నీ అంతర్గతంగా ఉంటాయి. నేను మిమ్మల్ని ఒక మార్గంలో నడవమని చెప్పడం లేదు. నేను మీకు ఫలానా మార్గాన్ని నిర్దేశించడమూ లేదు, మీరు ఫలానా గమ్యాన్ని చేరుకుంటారని హామీ



ఇవ్వడమూ లేదు. ప్రేమ యొక్క వ్యక్తీకరణలన్నీ సహజమైనవి, వాటిని వ్యక్తం చేయకుండా ఉండలేము. మీరు దానిని ప్రయత్నం అని అనవచ్చు. నాకేమీ అభ్యంతరం లేదు. ఆ ప్రయత్నాలు మనం ఏదో పొందటానికి కాదు, అనుభవం చెందడానికి అవసరం అవుతాయి. అవి ఏదో లక్ష్యాన్ని చేరడం కోసం మార్గాలు కాదు, ఆ ప్రయత్నమే మనకు ఆనందదాయకంగా ఉంటుంది. కానీ మనస్సులో ఇంకా అటువంటి ప్రేమ లేనివారికి, నేను ఇక్కడ కూర్చొని వేయి సంవత్సరాలు ఉపన్యాసాలు ఇచ్చినా అది అర్థం కాదు. "ఈ ప్రయత్నానికి, ఆ ప్రయత్నానికి తేడా ఏమిటి?" అని అప్పటికీ వారు అడగవచ్చు. ఆ తేడా చాలా సూక్ష్మమైనది. అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మనం ఆ తేడా ఇదీ అని చెప్పి దానిని నిర్వచించలేము. కాబట్టి మీరు ప్రయత్నం అవసరమా, లేదా అని అడిగితే నేనేం చెప్పగలను? ఒక రకంగా చూస్తే, అవును, ప్రయత్నం అవసరం. ఇంకో రకంగా చూస్తే అవసరం లేదు. కనుక ప్రయత్నం అవసరమా లేదా అని చర్చించడం, ప్రయత్నం అవసరమనిగానీ, అవసరం లేదనిగానీ చెప్పడం, 'అంతా అనుగ్రహంతోనే జరుగుతుంద'ని సిద్ధాంతీకరించడం అర్థరహితం. దానికి అర్థం లేదు. ముందు మనం, ప్రయత్నం అంటే ఏమిటి? సాధారణంగా అందరూ ఎందుకు ప్రయత్నం చేస్తారు, ఆ ప్రయత్నం పట్ల వారి దృక్పథం ఏమిటి – ఇతరులు ప్రయత్నం అనే పదాన్ని ఏ భావంలో వాడుతున్నారు. ఎలా అర్థం చేసుకుంటున్నారు మొదలైన విషయాలు తెలుసుకోవాలి.

**గురువుగారు :** కాబట్టి మనం చేసే ప్రయత్నం హృదయపూర్వకంగా ఉండాలి అంతేగానీ ఒక రకమైన క్రమశిక్షణలాగా లేదా పట్టుదలతో చేసేదిలాగా ఉండకూడదు. అది మన భావోద్వేగాలతో ముడిపడి ఉండాలి. ఎప్పుడైతే మనం చేసే ప్రయత్నానికి మన భావోద్వేగం తోడవుతుందో అప్పుడు మీరు చేసే ప్రతి పని మీ ప్రయత్నంలో భాగం అవుతుంది. మనలోని ఆ భావోద్వేగం మనలను సహజంగా అన్ని విషయాలపై కేంద్రీకృతమయ్యేటట్లు చేస్తుంది. అప్పుడు మన ప్రయత్నం మన భావోద్వేగానికి వ్యక్తీకరణ అవుతుంది. అందుకనే ధ్యానమంటే ఏదో సాధించడానికి ఒక మార్గమో, ఒక విధానమో కాదని, ధ్యానమంటే ఓ అనుభవాన్ని ఆస్వాదించడమని అంటాను. నిజమైన ధ్యానం అంటే అది. ఉదాహరణకు, మీకు బాబా అంటే చాలా ఇష్టం. కానీ కొంతకాలంపాటు మీకు బాబా దగ్గర కాసేపు కూడా కూర్చునే అవకాశం రాలేదు. చివరకు అవకాశం దొరికి, మీరు బాబా దగ్గర ఆనందంగా కూర్చుని ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నారు. ఆ అనుభూతి కోసం మీరు ప్రయాసపడలేదు. మీరు నిజంగా బాబాను ప్రేమిస్తున్నట్లయితే ఆయన మీద మనస్సు లగ్నం చేయడానికి అంత శ్రమపడాల్సిన అవసరం ఉందా? లేదు. ఆ అనుభవం మనకు సహజంగానే వస్తుంది. అంతే! ఉదాహరణకు, మీరు తృప్తిగా భోజనం చేసారు. ఆకలి తీరింది. తరువాత మీరు ఓ కునుకు తీస్తారు, ఆనందంగా రిలాక్స్ అవుతారు. అదే ధ్యానమంటే.



**భక్తుడు** : అది ఎలా వస్తుంది గురువుగారూ!

**గురువుగారు :** ప్రేమ వల్ల. మీలో ప్రేమ ఉన్నంతవరకు అది సహజంగానే వస్తుంది. అప్పుడు ప్రతిదీ అందులో భాగం అవుతుంది. మనం చేసేదంతా ధ్యానమవుతుంది. ఎందుకంటే మనం చేసేవన్నీ మన అనుభవాన్ని వ్యక్తం చేస్తాయి. అందుకనే నేను అనుభూతి చెందడం, తిరిగి దానిని వ్యక్తం చేయడం (Experience & Expression) ముఖ్యమంటాను.

**భక్తుడు** : గురువుగారూ! సాక్షాత్కారం మన ప్రయత్నం మీద ఆధారపడి ఉంటుందా?

**గురువుగారు :** ఆత్మసాక్షాత్కారం ఎలా వస్తుంది, ఎప్పుడు వస్తుంది, ఎటువంటి ప్రయత్నాలు చెయ్యాలి, మన సాధనలన్నీ చివరికి సటోరిగానో లేక మోక్షంగానో పరిణమిస్తాయా లేదా, అసలు మన సాధనలకి, వీటికి ఎటువంటి సంబంధం లేదా – మొదలైన ప్రశ్నలన్నీ ఆధ్యాత్మికరంగంలో తర్కానికి అంతుబట్టని చిక్కుప్రశ్నలు. బుద్ధునికి నిర్వాణం వచ్చినప్పుడు, ఆరు సంవత్సరాలపాటు ఆయన చేసిన చాలా రకాలైన ధ్యానాలు, యోగాలు, వివిధ తాత్విక సంప్రదాయాల అధ్యయనాలు, అనుష్టించిన తపశ్చర్యలు కారణమయ్యాయా? ఆయన బుద్ధగయకు వచ్చి బోధివృక్షం క్రింద కూర్చున్నారు. ఆయన చేసిన కఠోరమైన సాధనలన్నీ వ్యర్థమని, నిరుపయోగమని ఆయనకు అనిపించింది. అప్పుడు ఆయన, "నా ప్రశ్నకు సమాధానం లభించి, సత్యాన్ని తెలుసుకునేవరకు నేను ఇక్కడే కూర్చుంటాను, అది పొందేవరకు ఇక ఇక్కడి నుండి లేవను. నేను ఇక్కడే చనిపోయినా సరే" అనుకొన్నారు. అలానే కూర్చున్నారు, నిర్వాణం పొందారు.

**భక్తుడు** : ఇది మీరు చెప్పిన మామిడిపండు, రాళ్ళు ఉదాహరణలా ఉంది కదా, గురువుగారూ!

**గురువుగారు :** ఒక విధంగా నిజమే. ఎందుకంటే తాను చేసిన సాధనలు, అధ్యయనం చేసిన సంప్రదాయాలు ఎంత నిరుపయోగమో బుద్ధుడు గ్రహించాడు. ఆ గ్రహింపు వల్లనే నిర్వాణం సాధించేవరకు అలా కూర్చోవాలి అనేంతటి దృఢసంకల్పం ఆయన పొందారేమో. కానీ ఇంకోవిధంగా చూస్తే అక్కడ కూర్చొని ఆయన పొందినదానికీ ఆయన చేసిన సాధనలకూ ఎటువంటి సంబంధమూ లేదు. కాబట్టి ఆయన పొందిన స్థితి ఆయన చేసిన సాధనల ఫలితమనీ చెప్పలేము, అలాగని ఆయన చేసిన సాధనలకూ, ఆ స్థితికి అసలు సంబంధమే లేదని వాటిని త్రోసిపుచ్చనూలేము. వాటికి, ఆయన పొందిన దానికి ఏదో సంబంధం ఉంది. అదే సమయంలో ఏ సంబంధమూ లేదు. అదే అక్కడ మిస్టరీ.

సాక్షాత్కారాన్ని పొందిన వారంతా అది ఆకస్మికంగా, హఠాత్తుగా, అప్రయత్నంగా వచ్చింది అంటారు. "అది అలా వచ్చేసింది, అంతే" అంటారు వాళ్ళు. అది మన ఉదాహరణలో పదవరాయిలాంటిది. అందుకని ఒక రకంగా చెప్పాలంటే అది క్రమంగా వస్తుంది, ఇంకో రకంగా చెప్పాలంటే అది ఆకస్మికంగా వస్తుంది.

**గురువుగారు :** మాష్టరుగారి దగ్గరకు వచ్చిన తరువాత కొంతకాలంపాటు నేను కూడా వివిధ రకాల



ధ్యానప్రక్రియలు, సాధనలు అన్వేషించాను. దాదాపు సమస్త ఆధ్యాత్మిక సాధనలూ చేసాను. కానీ ఆ సాధనలకు, నేను పొందిన అనుభవానికి ఏ మాత్రం సంబంధం లేదు. నేను చేసిన సాధనలన్నీ ఆ అనుభవానికి దారి తీసి ఉండవచ్చు. అవి నేను చెప్పిన మామిడిపండు కథలో పదవరాయిలాంటివి కావచ్చేమో. నేను నా వ్యక్తిగత సమస్యను పరిష్కరించుకోవాలనే అవసరంతోనే ఆ ధ్యానప్రక్రియలన్నీ అన్వేషించాను కానీ అవి శాస్త్రాలలో విధించబడిన సాధనలని కాదు. నా వ్యక్తిగత సమస్యే నాకు అత్యంత తీవ్రమైనదిగా తయారయింది. దానికి పరిష్కారం కనుక్కోవడం నాకు అత్యవసరమైంది. నేను దానికి ఏదో  రకంగా పరిష్కారం కనుగొనడానికి ప్రయత్నించాల్సి వచ్చింది.

**గురువుగారు :** బౌద్ధులు “మీ నిర్వాణాన్ని మీరే సాధించుకోవాలి, మీకు బుద్ధులు (బుద్ధత్వం పొందినవారు అంటే నిర్వాణం పొందినవారు) కేవలం దారి మాత్రమే చూపిస్తారు, దానిలో నడవాల్సింది మాత్రం మీరే” అని అంటారు. అలానే భక్తిమార్గంలో ఉన్నవారు, “మీరు చెయ్యగలిగింది ఏమీ లేదు, ప్రయత్నం అవసరం లేదు. అన్నీ గురువు అనుగ్రహం వలనే పొందుతారు” అంటారు. వీటిల్లో ఏది నిజం? రెండూ కరెక్టే. అలా అని వాటిని అతిగా అంటిపెట్టుకుంటే అప్పుడు రెండూ తప్పే. అసలు నిజం ఈ రెండింటికీ మధ్య ఎక్కడో ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ, మా వాసనలను మార్చుకోవడానికి మేము ప్రయత్నం చెయ్యాలి అని మీరన్నారు. కానీ మీరే, మనం చేయగలిగింది ఏమీ లేదు, అంతా బాబానే చూసుకుంటారు అని కూడా అన్నారు. ఇవి రెండూ పరస్పర విరుద్ధంగా ఉన్నట్లు అనిపిస్తోంది.

**గురువుగారు :** దానికి రెండు కారణాలున్నాయి. మొదటిది, అంతా సద్గురువు చూసుకుంటారని మీరు నమ్మడం లేదు. అందుకనే మీరు ఎప్పుడూ, “నేను ఏం చెయ్యాలి, ఏదైనా సాధన చెయ్యాలా, ఏదైనా ధ్యానం చెయ్యాలా?”అని అడుగుతూనే ఉంటారు. మీలో ఏదో ప్రయత్నం చెయ్యాలన్న అవసరం ఇంకా ఉంది. రెండవ కారణం ఏమిటంటే, ఏదో ఒక సాధన చేస్తే, పరిస్థితి ఇప్పటికన్నా దిగజారకుండా ఉంటుందేమో అనిపించడం. (నవ్వులు..)

బాబా మీకు టిక్కెట్ కొనిచ్చారు. మిమ్మల్ని ట్రైన్ ఎక్కించి ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చోబెట్టారు. మీరు చెయ్యాల్సిందల్లా మధ్యలో దిగిపోకుండా ఆ ట్రైన్‌లో కూర్చుని ఉండటం. అంతే! కానీ మధ్యలో ఏదో ఒక అందమైన స్టేషన్ వచ్చిందనుకోండి. “నాకు ఇక్కడ దిగిపోవాలనిపిస్తోంది” అని అనుకొంటారు. అప్పుడు ట్రైన్‌లోకూర్చోవడమే పెద్ద ప్రయత్నంగా, కష్టంగా అనిపిస్తుంది. అప్పుడు బాబా మీకు ఒక సూచన ఇచ్చినట్లు చెప్పవలసి వస్తుంది. “అలా చెయ్యవద్దు, ట్రైన్‌లోనే ఉండండి, వదలిపెట్టకండి” అని. అది ఒక ప్రయత్నంగా అనిపిస్తుంది, కానీ నిజానికి అది ప్రయత్నం కాదు.



**భక్తుడు** : కానీ ట్రైన్‌లో ఉండటం అనేది మన ఛాయిస్ (ఎంపిక) కాదు కదా?

**గురువుగారు :** అది మన ఎంపిక కాకపోతే, అప్పుడు ఎటువంటి ప్రయత్నమూ అవసరం లేదు, మనం సంతోషంగా ట్రైన్‌లోనే ఉంటాం. సమస్యేమిటంటే, మనం ఛాయిస్‌లెస్‌గా ఉండే స్థితిలో (ఎంపిక చేసుకోవాల్సిన అవసరమే లేని స్థితిలో) లేము! మనకు ఇంకా చాలా ఛాయిస్‌లున్నాయి, ఎంపిక చేసుకోవడానికి ఎన్నో ఉన్నాయి. వాటిల్లో బాబా కూడా ఒకరు. మనకు ఎన్నుకోవడానికి ఒక్కటే ఉంటే దానిని ఎన్నుకోవడం అని అనము. అప్పుడు అక్కడ ఎన్నుకోవడానికి ఏముంది?

**భక్తుడు** : గురువుగారూ, ప్రయత్నం ఏదైనా చెయ్యాలి అని చెబితేనే నాకు ఉపయోగంగా ఉంటుంది. అప్పుడు ప్రయత్నం చేస్తూ, చివరికి అన్ని ప్రయత్నాలు వదులుకునే స్థితికి వస్తాను. కానీ మీరు మొదటే "నువ్వు ప్రయత్నం చెయ్యాల్సిన అవసరం లేదు" అని చెప్తే ఇక నేను ఏమీ సాధించలేనేమో అనిపిస్తోంది.

**గురువుగారు :** ప్రయత్నం అవసరం లేదని నేను అనడం లేదు. నేనలా చెప్పడంలేదు. కేవలం మీ ప్రయత్నానికి గల పరిమితులను గురించి తెలుసుకోమంటున్నాను. ప్రయత్నం చేయడం మీ అవసరం కాబట్టి మీరు చేస్తారు. ఎందుకంటే మనకు అవసరమైనది చేయకుండా ఉండలేం కాబట్టి. అలా మనం చేసే ప్రయత్నాలన్నీ నిష్ఫలమని, వాటికి పరిమితులు ఉన్నాయనే విషయాన్ని మీరు తెలుసుకోవడానికి మీరు ప్రయత్నించడం అవసరం. మీకు ఆ అనుభవాన్ని ఇచ్చేది సద్గురువు అనుగ్రహమే తప్ప ప్రయత్నం కాదు. అప్పుడు ఆ అనుభవం వచ్చినప్పుడు మీరు దానిని స్వీకరిస్తారు, అంతేగానీ సాధించినవారవ్వరు. మీరు చేసే ప్రయత్నం మిమ్మల్ని ఆ అనుగ్రహాన్ని స్వీకరించేలా చేస్తుంది. లేకపోతే అనుగ్రహాన్ని అందించినా మీరు దానిని స్వీకరించలేరు.

**భక్తుడు** : గురువుగారూ, బుద్ధుడు 'సరైన ప్రయత్నం' అన్నారు. అంటే ఏమిటి?

**గురువుగారు :** దానిని ఎన్నో రకాలుగా అర్థం చేసుకోవచ్చు. కానీ అవన్నీ ఒకే విషయాన్ని సూచిస్తాయి. ముందసలు, మనం ఎందుకు ప్రయత్నం చేస్తాం? ఇంతకుముందు నేను మీకు చెప్పినట్లు మనిషి చేసే సమస్త ప్రయత్నాలు, సమస్త సాధనలు తెలిసో తెలియకో వారిలో అస్పష్టంగా, అవ్యక్తంగా ఉన్న సంపూర్ణత్వ భావనను అనుభవపూర్వకంగా వాస్తవం చేసుకోవడం కోసమే. మనకు ఏం కావాలో సరిగా తెలుసుకోకుండా ప్రయత్నం చేస్తూ ఉంటే మన ప్రయత్నాలు నిష్ఫలమని మనకు తెలుస్తుంది. కాబట్టి ఇది 'సరైన ప్రయత్నం' అని అనిపించుకోదు. మనం చేసే ప్రయత్నాలన్నీ ఏదో సాధించాలన్న స్పృహతో చేస్తాం. ఏదో సాధించాలి అనే భావన దృఢంగా ఉంటే చాలా సందర్భాలలో అవి విఫలమవుతాయి. కాబట్టి ఇది కూడా బుద్ధుడు చెప్పిన 'సరైన ప్రయత్నం' కాదు.



రెండు రోజుల క్రితమే ఒక అబ్బాయి వచ్చి, పరీక్షల కోసం చదువుతున్నప్పుడు తనకు ఎదురయ్యే సమస్యల గురించి చెబుతూ, "నేను పరీక్షల కోసం చదువుతూనే ఉన్నాను, నేను ఎంతగా చదువుతున్నప్పటికీ నాకేదీ గుర్తుండటం లేదు" అన్నాడు. కానీ వెయ్యిసార్లు చదివిన ఒక వాక్యాన్ని గుర్తుంచుకోలేకపోయిన ఈ పిల్లవాడే, పది సంవత్సరాల క్రితం విడుదలైన సినిమా పాటలోని ప్రతి పదాన్ని అక్షరం పొల్లుపోకుండా చెప్పగలడు. ఆ పాట ఏ సినిమాలోనిది, దానికి దర్శకుడెవరు, దానిలోని డైలాగులను సైతం వెంటనే తిరిగి చెప్పగలడు. అతనికి జ్ఞాపకశక్తి తక్కువంటారా? అతను పదిహేను సంవత్సరాల క్రితం చదివిన నవలలోని పాత్రలతో పాటు, ఆ రచయిత ఎవరో కూడా చెప్పగలడు. అతడు ఆ నవలను ఒక్కసారే చదివాడు, కనీసం దానిని గుర్తుపెట్టుకోవడానికి కూడా ప్రయత్నించలేదు. అయినా అన్నీ గుర్తున్నాయి. కానీ తన పాఠ్యపుస్తకాలలోని విషయాలను గుర్తుపెట్టుకోవడానికి ఎంత ప్రయత్నించినా ఏ ఒక్క విషయం కూడా గుర్తుపెట్టుకోలేకపోతున్నాడు.

కాబట్టి ఒక ప్రయత్నంగా అనుభవంకాని ప్రయత్నమే 'సరైన ప్రయత్నం'. అది ఎంత అనాయాసంగా ఉంటుందంటే అది ఓ ప్రయత్నంలా అనిపించదు. మనం ప్రయత్నం చేస్తున్నపుడు ఒకటి చెయ్యాలని దానివైపుకు లాగబడతాం. అదే సమయంలో మనలో ఉన్న వివిధ కోరికలు మనల్ని రకరకాల వైపుల నుండి తమవైపుకు లాగుతూ ఉంటాయి. కాబట్టే మనం విఫలమవుతాము. మన హృదయంలోని కోరికలు, భావోద్వేగాలు, అన్నీ సమరతతో ఒక క్రమంలోకి వచ్చినపుడు, అక్కడ నుండి మనం చేసేటటువంటి ప్రయత్నమే 'సరైన ప్రయత్నం'. అందుకనే దానిని సంస్కృతంలో సమ్యక్ వ్యాయామ అంటారు. నిజానికి 'సరైన ప్రయత్నం' అనే పదం బుద్ధుడు చెప్పిన దానికి సరైన భావానువాదం కాదు. సాధారణంగా 'సమ్యక్' అనే పదాన్ని 'సరైన' అని అనువదిస్తారు. కానీ దానికి సరైన అర్థం 'సమ్మ' (సమ) కలిగి ఉండేది' అని. అంటే ఒక రకమైన సామరస్యం, క్రమత – అంటే ఒక పరిపూర్ణమైన పొందికతో కూడిన భావోద్వేగస్థితి నుండి ఉద్భవించే ప్రయత్నం. అప్పుడు మనం చేసే ప్రతిదీ, మనం చూసే ప్రతిదీ, మనం మాట్లాడే ప్రతి మాట, మనం ఆలోచించే ప్రతి విషయం ఆ సామరస్యాన్ని వ్యక్తం చేస్తుంది. అదీ సరైన ప్రయత్నం, సరిగా చూడటం, సరిగా ఆలోచించడం, సరిగా మాట్లాడటం, సరిగా జీవించడం.

**"నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను. నేను ఇవ్వదలచినది వారు అడిగేంతవరకు"**

**- శ్రీసాయిబాబా**

# తలక్రిందులుగా వ్రేలాడటంలోని అంతరార్థం - జూన్ 2014





"నేను మాత్రం ఆకలితోను దాహముతోను నుంటిని. బంజారా చూపిన అసామాన్య ప్రేమకు లొంగిపోతిని. మేమెంతో తెలివైన వారమనుకొంటిమి కాని, దయాదాక్షిణ్యములకు దూరమయితిమి. బంజారా చదువుకున్నవాడు కాడు, యోగ్యతలు లేనివాడు, తక్కువ జాతివాడు. కాని వాని హృదయము ప్రేమమయము. భోజనము చేయమని మమ్ములను వేడెను. ఈ విధముగా ఫలాపేక్ష లేకుండా ఎవరయితే ఇతరులను ప్రేమించెదరో వారు నిజముగా నాగరికులు అని యెంచి వాని యాతిథ్యము నామోదించుటయే జ్ఞానమునకు ప్రథమ సోపానమని యనుకొంటిని. మిక్కిలి మర్యాదతో అతడు పెట్టిన భోజనము నేను తిని (అనగా బాబా) నీళ్ళు త్రాగితిని.

..... అప్పుడు వారు "నాతో వచ్చుట కిష్టపడెదరా? మీకు కావలసినదేదో నేను చూపెదను. నాయందు విశ్వాసమున్నవారికే జయము కలుగును" అనిరి.

... అంతట వారు నన్నొక బావి వద్దకు దీసికొనిపోయిరి. నా కాళ్ళను తాడుతో కట్టి నన్ను తలక్రిందులుగా ఒక చెట్టుకి గట్టి బావిలో నీళ్ళకు మూడడుగులు మీదుగా నన్ను వ్రేలాడదీసిరి. నా చేతులతోగాని, నోటితోగానీ నీళ్ళను అందుకొనలేకుంటిని. నన్ను ఈ విధముగా వ్రేలాడగట్టి వారు ఎచ్చటికో పోయిరి. 4,5 గంటల తరువాత వారు మరల వచ్చి నన్ను బావిలో నుంచి బయటకు తీసి, యెట్లుంటివని యడిగిరి. "ఆనందములో మునిగియుంటిని, నేను పొందిన ఆనందమును నావంటి మూర్ఖుడెట్లు వర్ణించగలడు!" అని జవాబిచ్చితిని. దీనిని విని గురువుగారు మిక్కిలి సంతుష్టి చెందిరి. నన్ను దగ్గరకు చేరదీసి నా వీపును తమ చేతులతో తట్టి నన్ను వారి వద్ద నుంచుకొనిరి. తల్లిపక్షి, పిల్లపక్షులను జాగ్రత్తగా జూచునట్లు నన్ను వారు కాపాడిరి.

నన్ను తమ బడిలో చేర్చుకొనిరి. అది చాలా అందమైన బడి. అక్కడ నేను నా తల్లిదండ్రులను మరచితిని. నా అభిమానమంతయు తొలగెను. నాకు సులభముగా విమోచనము కలిగెను. గురువుగారి మెడను కౌగిలించుకొని వారిని తదేక దృష్టితో నెల్లప్పుడు చూచుచుండవలెననిపించినది.... నా గురువే నాకు సమస్తముగా తోచుచుండెను. నా ఇల్లు, నా ఆస్తి, నా తల్లిదండ్రులు అంతయు వారే. నా ఇంద్రియములన్నియు తమ తమ స్థానములు విడచి, నా కండ్లయందు కేంద్రీకృతమయ్యెను. నా దృష్టి నా గురువునందు కేంద్రీకృతమయ్యెను. నా ధ్యానమంతయు నా గురువు పైననే నిల్పితిని. నాకింకొక దానియందు

స్పృహ లేకుండెను. వారిని ధ్యానము చేయునప్పుడు నా మనసు, నా బుద్ధి స్తబ్ధమగుచుండెను. నిశ్శబ్ధముగా వారికి నమస్కరించుచుంటిని". **– శ్రీసాయి సచ్చరిత్ర, 32వ అధ్యాయము**



**గురువుగారు :** బాబా, తమ గురువు కోసం అన్వేషిస్తూ ఆయనను కలుసుకున్నప్పుడు తమ గురువు తమకు భోజనం పెట్టారని చెప్పారు. అక్కడ భోజనం అంటే జీవితం. బాబా గురువు ఆయన్ని తలక్రిందులుగా ఒక బావిలో వ్రేలాడదీశారు. ఆ సమయంలో బాబా అవధులు లేని ఆనందాన్ని అనుభవించారట! బాబా తరచుగా ఉపమానాలతోనూ, సంకేతాత్మకంగానూ మాట్లాడేవారు. తమ గురువు 'వంజారి' అని ఆయన చెప్పారు. 'వంజారి' అంటే వర్తకుడు. సమాజంలో దిగువ తరగతికి చెందినవాడు, కాయకష్టం చేసి జీవించేవాడు. ఆ వంజారీనే బాబాను బావిలో తలక్రిందులుగా వ్రేలాడదీసినదీ, బాబాకు ముక్తిని ప్రసాదించినదీ! అప్పటిదాకా బాబా అనుకున్నదంతా తలక్రిందులయింది. ఆయన అస్తిత్వమంతా తలక్రిందులయింది.

జీవితంలో ఎన్నోసార్లు అలా తలక్రిందులవటాన్ని మనం రుచి చూస్తూనే ఉంటాము. కానీ ఒక సమర్థ సద్గురువు ద్వారా బాబాకు అలా జరిగినపుడు ఆయన అవధులు లేని ఆనందాన్ని అనుభవించారు. ఆ తరువాత బాబా తమ గురువునెంతగా ప్రేమించారంటే రాత్రింబవళ్ళు తదేక దృష్టితో ఆయననే చూస్తూ ఉండేవారట. వారి ధ్యానమంతా గురువు మీదనే ఉండేది. ఆయన తప్ప ఇంక వేరే లక్ష్యం లేదు. అలా తాను దాదాపు 12 సంవత్సరాలు తమ గురువు వద్దే గడిపానని బాబా చెప్పారు. ఇక్కడ 12 సంవత్సరాలు అని చెప్పడం కూడా సంకేతాత్మకమే కావచ్చు.

**గురువుగారు :** తమ గురువును చూస్తున్నప్పుడు తమను తాము మరచిపోయేవారని బాబా చెప్పారు. వారిలోని ప్రాణశక్తులన్నీ చూపులో కేంద్రీకృతమై, ఆనందపారవశ్యంలో ఉండేవారట. ఆ తరువాత, బాబా తమ గురుదేవుల నుంచి దూరంగా ఉన్నప్పుడు కూడా ఆయన తమ గురుసాన్నిధ్యానికి మాత్రం దూరం కాలేదట. వారి గురువు ఎప్పుడూ వారితో ఉన్నట్లుగానే అనిపించేదట. బాబా మనకు చెప్పింది కూడా అదే. "ఈ విశాల విశ్వంలో మీరు ఎక్కడ ఉన్నా నేను మీతోనే ఉంటాను. మీ హృదయమే నా నివాసం. మీరు సప్తసముద్రాలకు ఆవల ఉన్నా నా అనుగ్రహదృష్టి మీ మీదనే ఉంటుంది" అని చెప్పారు.

**భక్తుడు :** గురువుగారూ, రూమీ,[1] వారి గురువు షామ్స్[2] ఒక గదిలో కొన్ని వారాలపాటు కలసి ఉన్నప్పుడు కూడా ఇలాంటిదే జరిగిందా?

**గురువుగారు :** తన గురువు సాన్నిధ్యంలో తాను ఆనంద పారవశ్యంలో ఉన్నానని రూమీ చెప్పారు. వారి గురువు అదృశ్యమైన తరువాత కూడా రూమీ పారవశ్యం అలాగే కొనసాగింది. షామ్స్, రూమీకి

1&2. క్రీ.శ. 1207–1273 మధ్య కాలంలో జీవించిన శ్రీ జలాలుద్దీన్ రూమీ ప్రఖ్యాత పర్షియన్ కవి, గొప్ప సూఫీ మహాత్ములు. తమ గురువైన షామ్స్–ఎ–తబ్రిజీ (క్రీ.శ. 1247) పట్ల ప్రేమ, భక్తి భావాలతో నిండిన ఆయన కవిత్వం యావత్ ప్రపంచాన్నీ ఆకర్షించింది.



ఆనందపారవశ్యాన్ని రుచి చూపించారు. ఆ పారవశ్యం రూమీ జీవిత పర్యంతం కొనసాగింది. సూఫీ సంప్రదాయంలో ఇటువంటి నేపథ్యం కనిపిస్తుంది. సద్గురువు (ముర్షద్) సాంగత్యంలో దీర్ఘకాలం ప్రగాఢమైన ఆర్తితో ఉంటూ ఆనందపారవశ్యాన్ని అనుభవిస్తారు. ఆ తరువాత వారు లౌకిక ప్రపంచంలోకి వచ్చినప్పటికీ ఆ పారవశ్యం అలాగే కొనసాగుతూ ఉంటుంది. కానీ సూఫీ మహాత్ముల మాటలను అక్షరమక్షరం అలాగే తీసుకోలేము. అవి సంకేతాత్మకంగా ఉండవచ్చు. లేకపోతే నిజంగానే అలా జరిగి ఉండవచ్చు. అది ఏది అనేది మనం చెప్పలేము. ఉదాహరణకు బాబా బావిలో తలక్రిందులుగా వ్రేలాడటాన్ని తీసుకోండి. సూఫీ మహాత్ములు చేసే కొన్ని సాధనా పద్ధతులలో కూడా తలక్రిందులుగా వ్రేలాడటం అనేది ఉంది.

**గురువుగారు :** బాబా ఆ బావిలో తలక్రిందులుగా వ్రేలాడటం అనే కథను మనం ఎలా అన్వయించుకోవాలి? ఆయన ఆ బావిలో 12 సంవత్సరాలు తలక్రిందులుగా అలా వ్రేలాడారని కాదు. తాము దేనికోసం అన్వేషిస్తున్నామో ఆ లక్ష్యం యొక్క అనుభవాన్ని కాస్త చవిచూసిన తరువాత, ఆయన బావిలో నుండి వెలుపలికి వచ్చి తమ ఆనందానికి మూలమైన సద్గురువును అంటిపెట్టుకుని ఉండిపోయారు. అక్కడ బాబా లక్ష్యం ఆనందానుభూతి. అంతేకానీ బావిలో ఉండిపోవడం కాదు. (గురువుగారు నవ్వుతూ..) మనం ఈ దృష్టాంతాన్ని సింబాలిక్‌గా (ప్రతీకాత్మకంగా) చూసినట్లయితే – అందులో చెప్పిన బావి బావి కాదు. నీళ్ళు నీళ్ళు కావు. బావి అనేది లోతుకు సంకేతం. మనకేదైనా అనుభవం వచ్చినపుడు మనం దాని లోతుల్లోకి వెళుతున్న భావన కలుగుతుంది. అందులో మునిగిపోతున్నామని అనిపిస్తుంది. అందుకనే చూడండి, మనమేదైనా సమస్యకు పరిష్కారం వెతుకుతున్నప్పుడు, “ఇంకా లోతుల్లోకి వెళ్లాలి, ఇంకా లోతుగా ఆలోచించాలి” అని చెప్తారు. దానర్థం నిజానికి అక్కడేదో లోతుగా ఉందని కాదు, కానీ మనం మన మనసు లోపలికి వెళుతుంటే అది లోతుగా అనుభవమవుతుంది. అక్కడ లక్ష్యం బావి కాదు, నీరు. నీరు ఆనందానికి సంకేతం. తమకు ఆనందానుభూతిని ఇచ్చిన సద్గురువును బాబా అంటిపెట్టుకొని ఉన్నారు. బాబా ప్రేమతో తమ దృష్టిని సంపూర్ణంగా తమ సద్గురువు మీదే కేంద్రీకరించారు. తాము సాధన చేశామనిగానీ, ఆత్మవిచారణ చేశామనిగానీ, తంత్రసాధనలు చేశామనిగానీ, ఇంకేదైనా చేశామనిగానీ బాబా చెప్పలేదు.

బాబా అనుభవాన్ని మనం ఒక్కసారి పునరావృత్తం చేసుకుంటే బాబా ఇలా అన్నారని చెప్పవచ్చు... “నా గురువు నాకు నా అస్తిత్వపు లోతులు చూపించారు. అక్కడ నా వాసనలు, నా ఆలోచనారీతులు, నాకు ఉందనుకుంటున్న జ్ఞానం, దాన్ని తెలుసుకునే విధానాలు అన్నీ తలక్రిందులయ్యాయి. అప్పుడు నేను ఆనందానుభవాన్ని చవిచూశాను. తరువాత ఆ ఆనందానుభవాన్ని నాకు ప్రసాదించిన వారి చెంత ఉండిపోయాను”. ఇలా మనం అన్వయించుకొని చదివితే, అప్పుడు బాబా తలక్రిందులుగా వ్రేలాడిన కథలోని సూక్ష్మం మీకు బోధపడుతుంది.

**భక్తుడు** : గురువుగారూ, పరమానందస్థితి **(bliss)** అంటే ఏమిటి?



**గురువుగారు :** ఏ లోటూ, ఏ అవసరం లేని స్థితి, పరిపూర్ణత, ఆనందం, అన్నీ ఉన్నాయన్న అనుభవం. తమ ఇంద్రియాలను, ప్రాణశక్తులను తమ గురువుమీద కేంద్రీకృతం చేసి పన్నెండు సంవత్సరాలపాటు గురువును అంటిపెట్టుకోగలిగిన సామర్థ్యం ఉన్న శ్రీసాయిబాబా వంటి వారికి అలాంటి అనుభవం సాధ్యమవుతుంది. మనకు కూడా ఆ అనుభవం లేశమాత్రంగా వివిధ మార్గాలలో రావచ్చు. కొంతమందికి సద్గురువు "ఇక్కడ మనం ఏదో పొందుతాము" అనే భావాన్ని వారి హృదయంలో కలిగిస్తారు. అది ఒకరకమైన భరోసా, ఆనందభావన – వర్ణనాతీతమైన నిగూఢమైన ఆకర్షణ – అది మనం ఆ ఆనందాన్ని పొందగలమని అనిపించే హామీ కాని హామీ. దానినే నేను అస్పష్టంగా, అవ్యక్తంగా ఉండే సంపూర్ణత్వ భావన అని అంటాను. ఆ భావనకు సద్గురువు స్పష్టమైన ప్రతిరూపం.

**భక్తుడు** : అయితే, బాబాలాగా మనకు ఫోకస్ లేకపోతే ఆ అనుభవం యొక్క తీవ్రత తగ్గిపోతుందా?

**గురువుగారు :** నిజానికి అక్కడ ఫోకస్ కాదు, మనం ఫోకస్ చెయ్యడానికి ఎంత సంసిద్ధంగా ఉన్నామో అన్నదే పాయింట్. బావిలో తలక్రిందులుగా ఉండి ఆ అనుభవాన్ని పొందేవరకు బాబాకు అటువంటి ఫోకస్ లేదు. కానీ ఆయనలో సామర్థ్యం ఉండింది. ఆయన ఆ ఫోకస్ పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. వారి గురువు ప్రసాదించిన అనుభవం వారికి ఆ ఫోకస్‌ను ఇచ్చింది. అంతకుముందు వరకు బాబాకున్న సంపూర్ణత్వ భావన చాలా అస్పష్టంగా ఉంది. బావిలో తలక్రిందులుగా ఉన్నప్పుడు సద్గురువు అనుగ్రహంతో బాబా దానిని స్పష్టంగా అనుభూతి చెందారు. ఆ తరువాత బాబా ఫోకస్ అంతా ఆయన గురువుపైనే నిలిచింది.

**భక్తుడు** : గురువుగారూ, అయితే ఈ సంసిద్ధత దేనిపైన ఆధారపడి ఉంటుంది?

**గురువుగారు :** మనలోని భావోద్వేగాల మధ్య, మనల్ని రకరకాల వైపులకు లాగే ఆకర్షణల **(pulls)** మధ్య సామరస్యం ఉండటమే సంసిద్ధత అంటే. ఆ సంసిద్ధమనే పాత్రలో మనకు అనుభవం అందించబడుతుంది. ఇలాంటి సంసిద్ధత ఉంటేనే మనం ఆ అనుభవానికి అర్హులమవుతాం అని నేను అనడం లేదు. ఈ విధమైన అర్హతే ఉండాలన్న అతి ఆలోచన వద్దు. అలా చేస్తే మీకు అవసరం లేని దానికోసం ఎప్పుడూ అన్వేషిస్తూనే ఉంటారు. అది మీకు దొరకదు. ఒకవేళ మీకు అది దొరికినా మీరు ఆనందంగా ఉండరు. మనం పొందే అనుభవం మన స్వభావానికి, మన వ్యక్తిత్వానికి, మన అవసరాలకు, మన కోరికలకు అనుగుణంగా ఉంటుంది. అప్పుడు మనం చెప్పుకున్న సామరస్యత వైపుగా నిజమైన ఎదుగుదల ఉంటుంది.

**భక్తుడు** : గురువుగారూ, కష్టాలు ఎదురైనపుడు వాటిని మనం ఎదుర్కోవాలని మీరు చెప్పారు. అలాంటి



**స్మరణతో సన్నిధిని, తలచిన పరిపూర్ణతనిచ్చు సాన్నిధ్యం – గురువు.**



ఇబ్బంది కరమైన పరిస్థితులలో మేము ఎలా ఉండాలి?

**గురువుగారు :** కష్టాలలో ఉన్నప్పుడు మీరు తట్టుకొని నిలబడగలిగితే, వాటి నుండి బయటపడటానికి మీవైన మార్గాలను మీరే అన్వేషించుకోవాలి. ఆ అన్వేషణ, ఆ ప్రయత్నమే మీరు ఆ పరిస్థితుల నుండి పారిపోకుండా తట్టుకొని నిలబడడానికి కావలసిన శక్తినిచ్చి, వాటిని ఎదుర్కోవడానికి క్రొత్త మార్గాన్ని చూపుతుంది. మీలో లోపిస్తున్నదేదో తరచి చూసుకోవడానికి దోహదపడుతుంది. ఆ శక్తి, మనదైన సంపూర్ణత్వాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి, ఆ సంపూర్ణత్వాన్ని సంపాదించుకోవడానికి అవసరం అవుతుంది.

**భక్తుడు** : ఆ పరిపూర్ణత్వాన్ని మనం సంపాదించుకోవాలా, గురువుగారూ!

**గురువుగారు :** గొప్ప మహాత్ముల విషయంలో కూడా పరిపూర్ణత్వం కోసం వారి తీవ్రమైన అన్వేషణ పక్వదశకు చేరుకున్నాకనే సద్గురువు వారికి ఆ మార్మికమైన అనుభవాన్ని ఇచ్చినట్లు చూస్తాము. కానీ వారి ఆధ్యాత్మిక సాధన అనబడేది ఆ అనుభవం తర్వాతే మొదలవుతుంది. బాబా జీవితాన్ని చూడండి. ఆయన తమ గురువును కలుసుకున్నారు. వారి గురువు వారిని తలక్రిందులుగా బావిలో వ్రేలాడదీశారు. అప్పుడు ఆయనకు పరమానందానుభూతి కలిగింది. విషయం అంతటితో ముగిసిపోలేదు, అది ఆరంభం మాత్రమే. బాబా పన్నెండు సంవత్సరాలపాటు వారి గురువుపైన సంపూర్ణంగా మనసు లగ్నం చేసి ఆయనతో ఉన్నారు. బాబా తమ గురువుమీదే మనస్సు లగ్నం చేయడం వలన ఆనందానుభవాన్ని పొందారా? లేక కేవలం అనుగ్రహంతో పొందారా? ఒకసారి ఆయన పొందాల్సింది పొందేస్తే మరి పన్నెండు సంవత్సరాలపాటు గురువు దగ్గరే ఎందుకు ఉండవలసి వచ్చింది? దానిని స్వంతంగా సంపాదించినట్టా, సద్గురువు అనుగ్రహంతో పొందినట్టా? ఆయన సంపాదించారు, కానీ ఆయన దాన్ని ఎలా సంపాదించు కున్నారు అంటే అనుగ్రహం ద్వారా సంపాదించుకున్నారు. ఇందులోని పరస్పర వైరుధ్యాన్ని మీరు అర్థం చేసుకుంటే దాన్ని సంపాదించుకుంటామా లేక అనుగ్రహ విశేషంగా పొందుతామా అనే విషయం మీకు అర్థమవుతుంది. ఈ రెండింటి మధ్య తేడా చాలా సూక్ష్మంగా ఉంటుంది. మన ప్రశ్నకు జవాబు ఈ రెండింటి మధ్యలో ఉంటుంది. ఇక దానిని అనుభవపూర్వకంగా తెలుసుకున్నవారికి దాన్ని గురించి వర్ణించడానికి పదాలు ఉండవు.

**గురువుగారు :** ముఖ్యంగా, విపరీత ధోరణిలో ఆలోచించవద్దు. అంతే ఇది మంచి, ఇది చెడు అనే ఖచ్చితమైన అభిప్రాయాలు పెట్టుకోవద్దు. ఏ విషయం గురించైనా తగినంత పరిశోధన చేయకుండా ముందుగానే నిర్ధారణకు రావద్దు. సత్యం ఎప్పుడూ నలుపు, తెలుపు అంత స్పష్టంగా ఉండదు. దాన్ని ఖచ్చితంగా అర్థం చేసుకోవడం, నిర్ణయించడం సాధ్యం కాదు. అది 'అలా కాదు కాబట్టి ఇలానే



ఉంటుంది, ఇలా లేదు కాబట్టి అలానే ఉంటుంది' అని మన మనస్సు ఇలా ఆలోచించడానికి అలవాటు పడిపోయింది. ఈ రకంగా మనకు కొన్న ఊహాజనితమైన ప్రతిపాదనలు మాత్రమే ఉంటాయి. నేను ప్రతి సత్సంగంలోనూ ఇలాంటి పరస్పర విరుద్ధమైన విషయాలను, నిగూఢమైన అంశాలను మీకు చెప్తూనే ఉంటాను. సత్యం అనేది రెండింటికీ మధ్యలో ఎలా ఉంటుందో ఇలాంటి వాటి ద్వారా తెలియజేస్తాను. ఇలా చూడగలగడమే జీవితంలో, ఆధ్యాత్మికతలో ఉన్న కళాత్మకత. ఆ సత్యాన్ని మీకు ఎవరైనా చెప్పాలని మీరు ఆశిస్తే, లేదా దాని గురించి ఎవరైనా నాలుగు వాక్యాలు వ్రాయాలని ఆశిస్తే మీ లక్ష్యం నెరవేరదు. ఎందుకంటే సత్యం వాక్యాలలో ఉండదు, ఆ వాక్యాలకు అతీతంగా ఉంటుంది. ఒకవేళ మీరు ఆ వాక్యాలను చదివి వాటి అర్థాలతో మీరు సంతోషపడితే సమస్యే లేదు. కానీ వచ్చిన సమస్యేమిటంటే ఆ అర్థంతో మీరు సంతృప్తి చెందడం లేదు. అందుకనే నేను మీ దృష్టిని వాక్యాల మధ్యలో నిగూఢంగా ఉన్న అర్థం వైపుకు మరల్చి అందులో సూక్ష్మంగా ఉన్న రమణీయతను మీరు ఆస్వాదించేలా చెయ్యాలని ప్రయత్నిస్తున్నాను. అది ఒక కవితాత్మకమైన రచన.

వాస్తవానికి తమ గురువు తమను తలక్రిందులుగా వ్రేలాడదీసి ఆనందానుభవాన్ని ప్రసాదించారు అని చెప్పినపుడు బాబా ఉద్దేశ్యం కూడా అదే. తలక్రిందులుగా వ్రేలాడడానికి, ఆనందానుభవానికి సంబంధం ఏముంది? ఆయన ఇలా ఉన్నా, అలా ఉన్నా ఆనందానుభూతి ఒక్కటే కదా? అయితే ఇక్కడ అప్పుడు తలక్రిందులుగా వ్రేలాడడం అనే దానికి అర్థమేమిటి? మనం విషయాలను గ్రహించి, అర్థం చేసుకునేటటువంటి పద్ధతి, ఆలోచనా సరళి **(Patterns)** అంతా తలక్రిందులయిందని అర్థం. అక్కడ ఆయన ఆలోచనారీతులు విచ్ఛిన్నమయ్యాయి, ధ్వంసమయ్యాయి. అదీ ఆయన గురువు పద్ధతి. అదీ ఆయన కవితాత్మకమైన రచన.

**భక్తుడు :** గురువుగారూ! మేము ఏ విషయాన్నైనా ఎప్పుడూ అలవాటుగా ఒకేవిధంగా అర్థం చేసుకుంటాము, ఒకే విధంగా ఆలోచిస్తుంటాము. ఏదైనా విషయాన్ని తెలుసుకోవడానికి మాకు తెలియని మరో పద్ధతి ఏదైనా ఉండి తీరాలి. అదేంటో మాకు తెలియడం లేదు.

**గురువుగారు :** మీరు ఏ విషయాన్నైనా మీ ప్రత్యేకమైన 'ఆలోచనారీతుల' **(Patterns)**లోనే అర్థం చేసుకుంటారు. ఆ మూస ఆలోచనారీతులను వదిలించుకోమని చెప్తున్నాను. మీ అవగాహన, మీ అభిప్రాయాలు వీటినే మీరు 'ఆలోచనారీతులు' అని అనుకొంటారు. కానీ ఏ విషయాన్నైనా అర్థం చేసుకునే విధానం కూడా ఒక 'ఆలోచనారీతే!' మనకు అన్నింటికన్నా వదిలించుకోవడం కష్టమైన 'ఆలోచనారీతి' ఏంటంటే, విషయాలను మనం అర్థం చేసుకునే విధానం. అది మీలో అత్యంత సూక్ష్మమైన స్థాయిలో ఉంటుంది. దానిని పరిశీలించుకోమంటున్నాను.

**భక్తుడు :** అయితే మీరు మమ్మల్ని పూర్తిగా మార్చేయాలేమో కదా, గురువుగారూ!



**అభయపదాన్ని అనుసరించినపుడే అభ్యుదయం సాధ్యమవుతుంది. -స్వామివివేకానంద**



**గురువుగారు :** అది చెయ్యడానికే నా ప్రయత్నమంతా. (నవ్వులు...) అందుకనే నేను మీలోని 'ఆలోచనారీతులను' ముక్కలు చేసి, ఆ సూక్ష్మమైన స్థాయిలో ఉన్న రమణీయత పైకి మీ దృష్టిని మరల్చడానికి ప్రయత్నిస్తున్నాను. నా దృష్టిలో ఇక్కడ పదాలు అంత ముఖ్యం కాదు, జరిగే ప్రక్రియ ముఖ్యం.

**గురువుగారు :** ఏదో ఒకరోజు మీరు వాస్తవాన్ని వాస్తవంగా చూస్తారు. మీరు అలా చూసినపుడు, మీకు నిజమైన ప్రేమను చూడగలిగే స్థైర్యం వస్తుంది. ఎందుకంటే, అప్పుడు మనసు పనిచేయడం ఆగిపోతుంది. అది చేసే వ్యాఖ్యానాలు **(Interpretations)** ఆగిపోతాయి. నిజమైన కమ్యూనికేషన్ ప్రారంభమవుతుంది. అప్పటివరకు ఇలానే సాగిపోతూ ఉంటుంది. నేననుకోవడం మీరందరూ ఇక్కడ ఉండేది మీ మనసు చేసే వ్యాఖ్యానాలను ఆపుకోవడానికే. ఆ వ్యాఖ్యానాలు అసత్యమని మీరు తెలుసుకోక తప్పదు. అప్పుడు మీకొక అనుభవం వచ్చి మీ అభిప్రాయాలను, ఆలోచనారీతులను చిన్నాభిన్నం చేస్తుంది. ఆ తరువాత కొంతకాలానికి మనస్సు అలసి, నిస్సత్తువై, "అమ్మో! ఇక ఏ వ్యాఖ్యానాలు వద్దు" అని అంటుంది. అప్పుడు మనస్సు వాస్తవాన్ని చూడటం మొదలుపెడుతుంది. అప్పుడు మీకు ఆనందానుభూతి మొదటిసారిగా లేశమాత్రంగానైనా అనుభవంలోనికి వస్తుంది.

**గురువుగారు :** బాబా చేసేది ఏంటంటే, మన అభిప్రాయాలు, మనకు ఉన్నది అనుకున్న జ్ఞానం, ఇవన్నీ తలక్రిందులు చేసి మనం ఆనందానుభూతిని పొందగలిగేలా చేయడమే. సద్గురువు ముందు మన భావనలను **(Concepts)** ధ్వంసం చేసి వాటిని తలక్రిందులు చేస్తారు. అవి ఏవైనా సరే. అవి మంచివనో, చెడ్డవనో కాదు. ఎలాంటివైనా అవి భావనలే **(Concepts).**

**భక్తుడు :** మన ఆలోచనారీతులను, భావనలను మార్చడానికి విభిన్న ఆధ్యాత్మిక సంప్రదాయాలు విభిన్నమైన మార్గాలను అనుసరిస్తాయి. మరి బాబా మార్గం ఏమిటి?

**గురువుగారు :** బాబా ఆ ఆలోచనారీతిని **(Pattern)** తీసేస్తారు. అంతే! ఎటువంటి ప్రత్యేకమైన పద్ధతి అవసరం లేకుండానే ఆ ఆలోచనారీతి మాయమవుతుందంతే. అది ఏ క్షణంలోనైనా జరగవచ్చు. సత్సంగంలోనో, ఊరకే అలా పర్వతాలకేసి చూస్తున్నప్పుడో, గంగానదిని చూస్తున్నప్పుడో ఇలా ఇంతకుముందు మనం వేయిసార్లు చేసిన పనులే అయివుండవచ్చు. మనలో ఏదో జరుగుతుంది. అకస్మాత్తుగా మనలోని ఒక ఆలోచనారీతి తొలగిపోతుంది. అంతే!! నువ్వు అప్పటిదాకా ఉన్న వ్యక్తివి కాదనిపిస్తుంది. నీ ఆలోచనా విధానం మారుతుంది. ఏమి జరిగిందో మనకు తెలియదు. కానీ మనలో ఏదో మార్పు జరిగిందని మాత్రం మనకు తెలుస్తుంది. మనలో నుండి ఏదో తీసివేసినట్లు, దాని స్థానంలో మరేదో వచ్చి చేరినట్లు అనిపిస్తుంది. మనకు మనమే క్రొత్తగా అనిపిస్తాము. మన మార్గం క్రొత్తగా అనిపిస్తుంది. మొత్తం ప్రపంచం మరో దృక్కోణంలో గోచరిస్తుంది. అదీ బాబా చేసేది.

# గురుపూజలలో ఆజ్యధార! అమృతధార!



"అంకుల్! కొంచెం నెయ్యి వెయ్యమంటారా!"

తొమ్మిదేళ్ళ శ్రావణి నెయ్యి గ్లాసు, పెద్ద చెంచాతో అడుగుతోంటే కాదనలేకపోయాను. రెండు చెంచాలు వేసి వెళ్ళిన కొన్ని క్షణాలలోనే చిట్టి చేతులతో మరో బాబు "నెయ్యి కావాలా? అని అడుగుతోంటే "ఇప్పుడే వేయించుకొన్నాను. వద్దులే! కావాలంటే పిలుస్తాను" అన్నాను. వెంటనే ఒక పెద్దాయన "ఏమిటీ! గుంటూరు గోంగూర కలుపుకున్నట్లున్నారే! కొంచెం నెయ్యి వెయ్యమంటారా?" అని అడిగారు. "వద్దుసార్! ఇప్పటికే మూడుసార్లు వేశారు". అని గోంగూర అన్నం రుచిని అనుభూతి చెందుతూ భోజనం కానిచ్చాను. పెద్ద పెద్ద పెళ్ళిళ్ళలో కూడా ఇంతగా నేతిని ఇన్నిమార్లు అడగరు. గురుపూజలలో మాత్రం ఈ రకంగా వడ్డించడానికి ఏమైనా ప్రత్యేకత ఉందా? అసలు ఈ నెయ్యి ఎక్కడి నుండి వచ్చింది? నెయ్యి పాల నుండి వస్తుందని అందరికీ తెలుసు. పాలను అమృతం అని పిలుస్తారు. అయితే పాల ఆయుర్దాయం చాలా తక్కువ. గరిష్ఠంగా పన్నెండు గంటలు. ఆ పాలు ఒకసారి భగవంతుని గూర్చి తపస్సు చేసింది. తపస్సుకు మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై వరము కోరుకోమన్నాడు. అప్పుడు పాలు "స్వామీ! నా ఆయుర్దాయం పెరగాలంటే నేను ఏం చేయాలి? ఎప్పటికీ నీ పూజలో భాగం అవ్వడమే కాకుండా నీకు సమర్పణ చెందినపుడు నీలో కలసిపోవాలి. అటువంటి వరం నేను పొందాలంటే నేనే సాధన చెయ్యాలి?" అని అడిగింది.

అప్పుడు భగవంతుడు "చాలామంది తమకోసం, తమ లాభం కోసం కోరికలు అడుగుతూ ఉంటే, నాలో కలసిపోవాలనే నీ కోరిక చాలా బావుంది. అయితే నీ కోరిక తీరాలంటే నీవు చాలా సాధన చేయాలి. చాలా కష్టపడాలి" అని అన్నాడు. దానికి పాలు చాలా సంతోషంతో "ఎంత కష్టమైనా సరే! నేను ఒప్పుకుంటున్నాను. కోరిక కోరమన్నావు కాబట్టి కోరుతున్నా! నా ఈ సాధన నడిపించవలసింది నీవే" అని కోరింది. "సరే!" అని భగవంతుడు అంతర్ధానమైపోయాడు.

పాలు ధ్యానంలో "ఏం చెయ్యాలి" అని ప్రశ్నించుకొన్నది. తనను తాను వేడి చేసుకోవాలని అనిపించి సాధన మొదలు పెట్టింది. నొప్పి కలిగినా భగవంతుని స్మరిస్తూ వేడి ఎక్కింది. తరువాత ఏమి చెయ్యాలి? తనలోంచే సమాధానం. తనకన్నా ముందు సాధన మొదలుపెట్టినవారి 'తోడు' కావాలి. తాను కూడా పెరగాలి. భాగవతులు కోరిన రీతిన "నీ పాదార్చకుల తోడినెయ్యము" అనే పద్ధతిలో తోడు కోసమని వెతికింది. భగవంతుని అనుగ్రహం వలన 'పెరుగుతోడు' దొరికింది. కొన్ని గంటల తపస్సు తనంతరం ఆశ్చర్యకరంగా తన రూపు మారింది. ఇదివరకున్న చంచల గుణం తగ్గి కొంత కుదురు వచ్చింది. ఆయుర్దాయం కొంత పెరిగిందే కాని, సాధన ఇంకా సాగాలి అని మళ్ళీ లోపలకు వెళ్లి ఆలోచించుకుంది.



**లోక శ్రేయస్సు, జీవుల హితమే లక్ష్యంగా కలిగినవారు - గురువు.**



మథనం జరగాలి. తిరిగి భగవంతుని ప్రార్థించింది. చిలకడం ప్రారంభింపబడింది. అటూ, ఇటూ తిరుగుతున్న కవ్వం తనకు ఇబ్బంది కలిగించినా, ఓర్చుకొని సాధన కొనసాగింప చేసుకుంది. కొంత సమయం తర్వాత తనలో నుండి ఏదో సారము ముద్ద కట్టుకొని వచ్చి పైకి తేలుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటిస్థితి కన్నా ఇంకా బావున్నదని, ఇంకా తన సారమంతా బయటకు వచ్చి గట్టి పడటం, అదే సమయంలో చాలా మృదుత్వాన్నీ అనుభూతి చెందింది. ఆయుర్దాయం కూడా  పెరిగింది. కృష్ణునికి చాల ప్రీతిపాత్రమైన వెన్నస్థితికి చేరినట్లుగా అనిపించింది.

అయితే సాధన ఇంకా సాగాలని తిరిగి భగవంతుని ప్రార్థించింది. వెంటనే వేడి చేయబడటం మొదలయ్యింది. వేడిని తట్టుకొంటున్న కొద్దీ, కమ్మటి సువాసనతో కూడిన రూపం ఏర్పడుతున్నట్లుగా అనిపిస్తున్నది. పాలగా ఉన్నప్పుడు అగ్నిహోత్రమును ఆర్పివేసే నేను ఆజ్యముగా ఎంత మార్పు? ఇప్పుడు తనలో ఉన్న కల్మషములన్నీ తొలగి భగవంతునికి హోమద్రవ్యములతో కలసి, సమర్పణము చెందు అర్హత కలిగిందనీ, దేవతల హవిస్సులకు తానే మాధ్యమంగా మారానని, తెలిసింది. కనుక నేయి రూపము పొందిన తనకు నిజమైన అమృతత్వస్థితి లభించిందని, పాలస్థితి నుండి నేయి స్థితికి మారటంలో తాను అనుభవించిన కష్టములు సాధనలకు సోపానాలని అర్థమైంది. నెయ్యిగా మారుతున్న కొలదీ మంచి సువాసనతో, రుచితో అందరికీ పుష్టినీ, తుష్టినీ ఇవ్వగలిగిన స్థితి పొందగలిగినందుకు చాల ఆనందించింది.

గురుపూజలలో వడ్డించదుతున్నది ఆజ్యధార కాదు. అమృతధారయే! గురుపూజలలో పాల్గొనుట ద్వారా మనము పాలవంటి స్థితి నుండి నేయి వంటి స్థితికి పరిణామము చెందవలెనని నేయి ఎక్కువగా వడ్డింపబడు చుండవచ్చును. గురుదేవులు మన అందరికీ అమృతత్వమును ప్రసాదింతురు గాక!

## చందా అడిగితే సందేశం

మనిషి నిత్య (దైనందిన) జీవితాన్ని ఎలా నియమించుకోవాలో, ఎలా నిర్వహించుకోవాలో, ఆ నిర్వహించుకోవడంలో ఎలాంటి మెలకువలను చూపాలో, ఎలాంటి అవగాహనను కలిగి ఉండాలో తెలియ చెబుతాయి – ఈ అక్షరాల్లో అనుభూతులు... అనుభవాలు... నిత్య జీవితాన్ని నియమించుకోవాలి, నియమించుకోవడం ద్వారా దానిని పవిత్రీకరించుకోవాలి. పవిత్రీకరణ చెందుతున్న జీవితాన్ని సద్వినియోగం చేయడం ఎలానో నేర్చుకోవాలి. సద్వినియోగం చేయగలిగిన స్థితిలో ఈ జీవితాన్నే ఒక యజ్ఞంగా రూపొందించుకొని, లోకహితాన్ని ఎలా సాధించాలో నేర్చుకోవాలి. మనిషిని చేయిపట్టుకొని ఈ మెట్లన్నీ ఎక్కిస్తాయి. ఈ అక్షరాలలో అనుభూతులు.



ఇలా మనల్ని పరిపూర్ణుల్ని చేసేందుకు గురువు మనకందించే అనుభూతులే మార్గదర్శకాలు. గురువందించే ప్రేమానుగ్రహ అనుభూతుల్ని అందుకునేందుకు... నియమించుకునేందుకు, నిర్వహించుకునేందుకు పవిత్రీకరించుకునేందుకు... సద్వినియోగం చేసుకొనేందుకు గురుపథంలోని కొన్ని అక్షరాలు – ఒక అనుభూతి. (ఎందుకీ జీవితంలోకి వచ్చింది? సద్గురువుని తెలుసుకో! –శ్రీసాయిబాబా)

మాస్టరుగారు యూనివర్శిటీలో పనిచేస్తూ ఉన్న రోజుల్లోనే కొంతమంది అభిమానులు ఒక బృందంగా ఏర్పడి ఒక కవిగార్కి సన్మానం చేయడానికి నడుంకట్టారు. మాస్టారుగారు తమ రూములో ఉండగా ఆ బృందం తరపున ఒక వ్యక్తి వచ్చి ఈ సంకల్పాన్ని వివరించాడు. అతను మాస్టరుగారికి చాలా సన్నిహితుడైన వ్యక్తి. సన్మానంతో బాటుగా కవిగారికి మంచి మొత్తం పర్సుగా కూడా అందించదలచామని చెప్పి మాస్టరుగారి సహాయం కోరాడు. మాస్టరుగారు ఒక్క క్షణం మౌనం వహించి ఇలా అన్నారు. “మీరేమీ అనుకోవద్దు ఇప్పుడు నేను మీకీయగలిగి ఉండి కూడా ఈయడం లేదు. ఎందుకంటే మీకీయడం నా సిద్ధాంతానికి విరుద్ధం అవుతుంది గనుక. ధనం సద్వినియోగం కావాలన్నది నా సిద్ధాంతం. ఇప్పుడు మీరడిగినదానికిస్తే అది జరగదు. ఏం జరుగుతుందో మీకూ తెలుసు. కవిగారు మీరిచ్చిన పర్సును బ్రాందీషాపుకు జమకడతారు. నా డబ్బు ఆ షాపుకు వెళ్ళడం నాకిష్టం లేదు. ఆయనంటే మీకెంత అభిమానమో నాకూ అంతే అభిమానం. అభిమానం ఉన్నందుకు ఆయన శ్రేయస్సు కోరగలనుగాని ఆయన వ్యసనానికి సహకరించలేను”.

అవతలవ్యక్తి అలా ఉండిపోయాడు కాసేపు. క్రమంగా తేరుకొని మెల్లగా లేచి “వెళ్ళివస్తాను” అన్నాడు. మాస్టరుగారు “నీవు వేరుగా అనుకోవద్దు. ఉన్నది చెప్పాగా” అంటూ భుజం తట్టారు. “అబ్బే అలాగ ఎందుకనుకుంటాను. మీ సంగతి నాకు తెలియదా! అందరితోపాటు మీ దగ్గరకూ వచ్చాను. అందరూ ఇచ్చింది చందా అయితే మీరిచ్చింది సందేశం. నిజానికి ఇదే చాలా విలువైనది”. అని నమస్కరించి సెలవు తీసుకున్నాడు. “ఎలా ఉంది కథ” అన్నారు మాస్టరుగారు నన్ను చూసి. మీలా చెప్పడానికి చాలా ధైర్యం ఉండాలి” అన్నాన్నేను. “ఉండకపోతే ఎలా మరి! మనని మొహమాటపెట్టి ఏ పనైనా చేయించవచ్చు అన్నట్లు మనముంటే ఎలా? ఆ వచ్చినతను నాకు బాగా సన్నిహితుడు. అతనిమాట నేను కాదనను అనే ఉద్దేశ్యంతోనే అతన్ని నా దగ్గరకు పంపారు ఆ బృందం వారు. అతనూ అలాగేననుకొని వచ్చాడు. నేను మొహమాటపడకపోయేసరికి ఆశ్చర్యపోయాడు. ***మరి మనం నమ్మిన విలువలకి మనమే కట్టుబడి ఉండ వద్దా”*** అన్నారు మాస్టరుగారు. ఆయన వాక్కులు సూటిగా తగిలే బాణాల్లాంటివి. ఆ బాణాలు మనలోని బలహీనతలను సంహరిస్తాయి. మనల్ని నిటారుగా నిలబెడతాయి.

# సాయి సైనికుడు

ఒకసారి శిరిడీలో కూర్చోనుండేటప్పుడు,
మనమందరము కూడాను
సాయి సైనికులం కావాలి. ఒక సాయిసేన
తయారు కావాలంటే...
మామూలు సైనికుడికి కత్తి, డాలు ఎలానో,
మనకు బాబా ప్రేమ, బాబా భక్తి, పారాయణ,
సత్సంగం ఇవి మన ఆయుధాలు.
సాటివారిని ప్రేమించడం.

ఈ కత్తి, డాలు పెట్టుకొని ప్రపంచంలోకి పోండి.
సైనికుడిలాగా ఉండండి. సైనికుడికేమంటే
వాడికంటూ ఏమీ ఉండదు. డిజైనింగ్ ఉండదు.
ప్లానింగ్ ఉండదు. ఏమీ ఉండదు.
ఇన్‌స్ట్రక్షన్ ఎలా ఉంటే అలా చేసుకుంటాడంతే.
వాడికంటూ వాడికొక ఇగో ఉండదు.
కాబట్టి మనందరము కూడాను బాబా యొక్క
సైనికులు క్రింద ఉందాము. అని చెప్పిన మాట
అది. అంతే తప్పితే సేన తయారు చేయమని
కాదు నా ఉద్దేశ్యము. సైనికుడికి ఉండేటువంటి
స్పిరిట్ మనకుండాలి.



***Spirit of a Soldier***

గురు మహిమ... గురు మహిమ... అపార మహిమ.... గురు మహిమ...





గురు మహిమ... గురు మహిమ... అనంత మహిమ.... గురు మహిమ...









గురు మహిమ... గురు మహిమ... అఖండ మహిమ.... గురు మహిమ...